




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 114 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 6 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 114 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 6 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## ముగిసిన నితీశ్ శకం..

### బీహార్ తదుపరి ముఖ్యమంత్రి రేసులో ఎవరెవరు ఉన్నారంటే..?

- రాజ్యసభకు నామినేషన్ వేసిన నితీశ్ కుమార్
- బీహార్ సీఎం పదవిని చేపట్టబోతున్న బీజేపీ!
- సీఎం రేసులో సామ్రాట్ చౌదరి, నిత్యానంద రాయ్, దిలీప్ జైశ్వాల్

పెన్ పవర్ డెస్క్:బీహార్ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు ముఖ్యమంత్రిగా చక్రం తిప్పిన నితీశ్ కుమా ర్, రాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకుని జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేయ డం

- మిగతా2లో



## సీఎం సలహాదారు పదవికి వేం నరేందర్ రెడ్డి రాజీనామా

- రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వేం నరేందర్ రెడ్డి
- నామినేషన్ వేయడానికి ముందు పదవికి రాజీనామా
- నామినేషన్ కార్యక్రమానికి హాజరైన రేవంత్ రెడ్డి

- మిగతా2లో

## గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ

# కేబినెట్ సబ్ కమిటీ

- గోదావరి పుష్కరాల నిర్వహణపై 9 మందితో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
- కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్ బాబు.. కన్వీనర్‌గా దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి
- 2027 జూలై 23 నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలు
- ప్రధాన ఆలయాలు, ఘాట్ల వద్ద శాశ్వత ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు, ప్యాకేజీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న గోదావరి పుష్కరాలకు (2027) ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించింది. 'దక్షిణ కుంభమేళా'గా పిలిచే ఈ మహా క్రతువు నిర్వహణ, ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది సభ్యులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పి.సుదర్శన్ రెడ్డిలను నియమించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి గోదావరి తీర ప్రాంతాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశాలకు పిలవనున్నారు. త్వరలోనే కమిటీ సమావేశమై సిఫార్సులను అందజేయనుంది.

2027 జూలై 23న గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈసారి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కోరాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో సుమారు 560 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తుండటంతో దాదాపు 74 ఘాట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ముఖ్యంగా బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం ఆలయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో అక్కడ ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు.

పుష్కరాల ఏర్పాట్లు తాత్కాలికంగా కాకుండా, శాశ్వత ప్రాతిపదికన ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆలయాల అభివృద్ధి, పర్మనెంట్ పుష్కర ఘాట్లు, రోడ్లు,

- మిగతా2లో

## హైదరాబాద్ ను క్రీడాహబ్ గా మారుస్తున్నాం

హైదరాబాద్ పెన్ పవర్:నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మెన్ శివసేన రెడ్డి , ఎండీ సోని బాలదేవిలతో కలిసి మంత్రి మాట్లాడారు.గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నట్లు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

- మిగతా2లో



## విధ్వంసం చేయకుండానే మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చు

- బీఆర్ఎస్ హయాంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామన్న కేటీఆర్
- ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని నిరూపించామన్న కేటీఆర్
- సుందరీకరణ పనులు తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని సవాల్

- మిగతా2లో





## తెలంగాణలో భానుడి భగభగ...

### ములుగులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

- పెరుగుతున్న పగటిపూట ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో అత్యధిక ఉష్ణోగ్రతలు
- వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచన

- మిగతా2లో

## తిరుపతిలో కవిత నోట 'జై ఆంధ్ర' నినాదం

- తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన కవిత
- రేణిగుంట విమానాశ్రయంలో జై ఆంధ్ర అంటూ నినాదం
- తన పార్టీకి స్వామి వారి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతున్నానని వ్యాఖ్య

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ఒక నూతన ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న కల్వకుంట్ల కవిత తిరుపతి పర్యటనలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ చర్చనీయాంశంగా మారాయి. కొత్త పార్టీని ప్రకటించబోతున్నట్లు ఇప్పటికే సంకేతాలిచ్చిన ఆమె... తిరుమల శ్రీవారి మొక్కు తీర్చుకోవడానికి కుటుంబ సభ్యులు, జాగృతి నాయకులతో కలిసి తిరుపతికి చేరుకున్నారు. రేణిగుంట విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న సమయంలో ఆమె 'జై ఆంధ్ర' అని నినాదం చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

- మిగతా2లో



## టోలీచౌకిలో ఘోర ప్రమాదం.. భవనంపై నుండి పడి కార్మికులు మృతి

- నిర్మాణం కోసం కట్టిన గోవా కర్రలు కూలి నలుగురు కార్మికులు మృతి
- మరికొందరికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్

- మిగతా2లో



# ఒక యుద్ధం.. 14 దేశాలు ఆగం



- మండుతున్న పర్షియన్ గల్ఫ్
- అమెరికా బేస్ క్యాంపులే లక్ష్యం
- ఇరాన్ డ్రోన్, క్షిపణి దాడులు
- అజార్ బైజన్ ఎయిర్ పోర్టుపై దాడి
- అమెరికా ఆధీనంలోని నక్చివాన్ టార్గెట్
- దాడి అమెరికా ఆధీనంలోని నక్చివాన్ టార్గెట్

పెన్ పవర్ డెస్క్: ఇరాన్,–ఇజ్రాయిల్– అమెరికా యుద్ధం విస్తరిస్తోంది. పర్షియన్ గల్ఫ్ లో ని యెమన్ మినహా అన్ని దేశాల్లో ఉద్రిక్త పరిస్థితు లు నెలకొన్నాయి. ప్రస్తుతం ఇజ్రాయిల్, సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఖతార్, కువైట్, టర్కీ, ఇరాక్, ఒమన్, అజార్ బైజాన్ పై ముమ్మరంగా డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ దాడులు చేస్తోంది. ప్రత్యేక ప్రాంతంగా గుర్తించిన నక్చివాన్ పైనా ఇవాళ దాడులు జరిగాయి. ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ వి మానాశ్రయం దగ్గర ఉన్న అమెరికా సైనిక స్థావరంపైనా దాడి జరిగింది. ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన ప్రకారం, దేశంలోని వాయు రక్షణ వ్యవస్థలు ఒక మిస్సైల్ దాడిని అడ్డుకున్నాయి. దోహా పై ఆకాశంలో అనేక పేలుళ్లు జరిగాయి. సౌదీ అరేబియా రక్షణ శాఖ వివరాల ప్రకారం.. ఒక డ్రోన్ దాడికి ఇరాన్ యత్నించగా.. అల్ జెఫ్ ప్రాంతం దగ్గరధ్వంసమైంది. టర్కీ గగన తలంలోకి వచ్చిన బాలిస్టిక్ మిస్సైల్ ను నాటో దళాలు నిర్వీర్యం చేశాయి. దీనిపై ఇరాన్ సైన్యం స్పందించింది. తాము టర్కీ భూభాగాన్ని టార్గెట్ చేయలేదని స్పష్టం చేసింది. ఒమన్ లోని ఆయిల్ మార్కె టింగ్ కంపెనీకి

- మిగతా2లో



## యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు

- ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు
- చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం అని ఉద్ఘాటన
- ఉగ్రవాద నిర్మూలనే ఇరువురి ఉమ్మడి లక్ష్యం అని ప్రకటన
- వలసలు, మొబిలిటీపై భారత్, ఫిన్లాండ్ కీలక ఒప్పందం
- విద్యా రంగంలో పరస్పర సహకారానికి నిర్ణయం

2లో



## అలా చేస్తే ఇజ్రాయెల్ అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటాం

- ఆరు రోజులుగా ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ మధ్య భీకర యుద్ధం
- ఇరాన్‌లో పాలకులు మారే వరకు యుద్ధం కొనసాగుతుందన్న ఇజ్రాయెల్
- పాలనను మార్చాలని చూస్తే అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరిక

2లో

## ఎడిటర్ వ్యూ

# ఆధునిక సాంకేతికతతో దంత వైద్య రంగ పరిణామం

ప్రతి సంవత్సరం మార్చి 6న దేశ వ్యాప్తంగా జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించడం ఒక ఆచారంగా మాత్రమే కాక, ఆరోగ్య సంస్కృతికి చెందిన ఒక సజీవ చైతన్యంగా పరిణమించింది. మనిషి శరీర నిర్మాణంలో దంతాలు కేవలం ఆహారం నమిలే సాధనాలుగా మాత్రమే కాకుండా, శరీర సమగ్ర ఆరోగ్యానికి ప్రతిబింబాలుగా, వ్యక్తిత్వ ఆత్మ విశ్వాసానికి ఆధార స్తంభాలుగా నిలుస్తాయి. దంత ఆరోగ్యం బాగుంటేనే శరీర ఆరోగ్యం సమతుల్యంగా నిలుస్తుందనే వైద్యశాస్త్ర సూత్రం నేటి ఆధునిక పరిశోధనలతో మరింత బలపడింది. ఈ నేపథ్యంలో దంత వైద్యుల సేవలను స్మరించుకోవడం, వారి కృషిని గౌరవించడం, ప్రజల్లో నోటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం జాతీయ దంత వైద్యుల దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యాలుగా నిలుస్తున్నాయి. భారత దేశంలో దంత వైద్య రంగ అభివృద్ధి చరిత్రను పరిశీలిస్తే, స్వాతంత్ర్యానికి ముందు దంత చికిత్సలు ప్రధానంగా నగర కేంద్రాలకు మాత్రమే పరిమితమయ్యేవి. 1948లో ఏర్పడిన డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దేశంలో దంత విద్యా ప్రమాణాలు, వైద్యుల నమోదు విధానం, వృత్తి నైతిక నియమావళిని స్థిర పరిచింది. ఈ మండలి ఏర్పాటుతో దంత వైద్య విద్యకు ఒక పటిష్ఠమైన వ్యవస్థ ఏర్పడింది. అప్పటివరకు కొన్ని మునిసిపల్ ఆసుపత్రులలో మాత్రమే ఉన్న దంత చికిత్సా సేవలు క్రమంగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల రూపంలో విస్తరించాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మూడు వందలకు పైగా దంత కళాశాలలు ఉన్నాయని అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. ప్రతి సంవత్సరం దాదాపు ఇరవై అయిదు వేలకుపైగా దంత వైద్య పట్టభద్రులు బయటకు వస్తున్నారు. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాలలో దంత వైద్యుల కొరత స్పష్టంగా కనిపించడం ఒక వ్యత్యాసంగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం ప్రపంచ జనాభాలో సుమారు 60 నుండి 90 శాతం మంది పిల్లలు దంత కృమి రోగంతో బాధ పడుతున్నారు. వయోజనుల్లో దంత మాంస క్షయం, పళ్ల వాపులు, నోటి పూతలు వంటి సమస్యలు సాధారణమయ్యాయి. భారత దేశంలో నిర్వహించిన జాతీయ మౌఖిక ఆరోగ్య సర్వేల ప్రకారం ఐదు నుండి పది సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో దంత కృమి రోగం శాతం 50కి పైగా ఉంది. పెద్దవారిలో దాదాపు 85 శాతం మంది జీవితంలో ఏదో ఒక దశలో దంత మాంస వ్యాధులను అనుభవిస్తారని అంచనా. ఈ గణాంకాలు దంత వైద్యుల అవసరాన్ని మరింత స్పష్టంగా తెలియ జేస్తున్నాయి.దంత ఆరోగ్య సమస్యలు కేవలం నొప్పి లేదా దంత నష్టంతో ముగియవు. మధుమేహం, గుండె జబ్బులు, గర్భిణీలలో పూర్వ ప్రసవ సమస్యలు వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధులకు నోటి ఆరోగ్యంతో ప్రత్యక్ష సంబంధం ఉందని ఆధునిక పరిశోధనలు నిరూపిస్తున్నాయి. నోటి లోపల ఉన్న సంక్రమణాలు రక్తప్రసరణ ద్వారా శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించి గుండె కవాటాలపై ప్రభావం చూపవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో దంత వైద్యుల పాత్ర కేవలం చికిత్సకే పరిమితం కాకుండా, సమగ్ర ఆరోగ్య పరిరక్షణలో కీలక భాగంగా మారింది. జాతీయ దంత వైద్యుల దినోత్సవ సందర్భంలో దేశవ్యాప్తంగా ఉచిత దంత పరీక్షా శిబిరాలు, పాఠశాలలలో అవగాహన సదస్సులు, గ్రామీణ ప్రాంతాలలో చలించే దంత చికిత్సా వాహనాల ద్వారా సేవలు అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో జాతీయ మౌఖిక ఆరోగ్య కార్యక్రమం అమలులో ఉంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే దంత చికిత్సా సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, అమలులో వనరుల కొరత, సిబ్బంది లోపం, ప్రజల్లో అవగాహనాభావం వంటి సవాళ్లు ఎదురవుతున్నాయి. భారత దేశంలో దంత వైద్యుల నిష్పత్తి పట్టణ ప్రాంతాలలో సుమారు ఒక లక్ష మందికి ఒక దంత వైద్యుడు ఉండగా, గ్రామీణ ప్రాంతాలలో అది రెండు నుండి మూడు లక్షల మందికి ఒకరుగా పడిపోతుంది. ఇది ఆరోగ్య సేవల అసమానతకు సూచిక. దంత వైద్య విద్యపై భారీ వ్యయం, ప్రైవేట్ ప్రాక్టీసులపై ఆధారపడాల్సిన పరిస్థితి, ప్రభుత్వ నియామకాలలో పరిమిత అవకాశాలు యువ దంత వైద్యులకు సవాళ్లుగా మారుతున్నాయి. అదే సమయంలో ఆధునిక సాంకేతికత, లేజర్ చికిత్సలు, ఇంప్లాంట్లు, కాస్మెటిక్ డెంటిస్ట్రీ వంటి విభాగాలలో భారత దంత వైద్యులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. పాన్పరాగ్, గుట్కా, ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు నోటి క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి. భారతదేశం ప్రపంచంలోనే నోటి క్యాన్సర్ కేసుల్లో ముందంజలో ఉందని వైద్య పరిశోధనలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం లక్షకు పైగా కొత్త నోటి క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని అంచనా. ఈ నేపథ్యంలో దంత వైద్యులు ప్రారంభ దశలోనే లక్షణాలను గుర్తించి చికిత్సకు మార్గనిర్దేశం చేయగలరు. గ్రామీణ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రాణాలను కాపాడే బాధ్యత కూడా వారి భుజాలపై ఉంది. దంత వైద్యుల వృత్తి నైతికత కూడా అత్యంత ప్రాధాన్యమైన అంశం. అవసరం లేని చికిత్సలు సూచించడం, అధిక రుసుములు వసూలు చేయడం వంటి ఆరోపణలు అప్పుడప్పుడు వినిపిస్తున్నప్పటికీ, విస్తృతంగా చూస్తే దంత వైద్యులు సమాజానికి సేవాభావంతో పనిచేస్తున్నారు. వైద్య వృత్తి నమ్మకంపై నిలబడిన వ్యవస్థ. ఈ నమ్మకాన్ని కాపాడుకోవడం ప్రతి దంత వైద్యుడి ధర్మ బాధ్యత. నిరంతర వైద్య విద్య, సాంకేతిక పరిజ్ఞానం అప్‌డేట్ చేసుకోవడం, పరిశోధనల్లో పాల్గొనడం ద్వారా వారు తమ నైపుణ్యాన్ని పెంపొందించు కుంటున్నారు. పిల్లలలో చిన్ననాటి నుంచే దంత శుభ్రత అలవాట్లు పెంపొందించాలి. రోజుకు రెండుసార్లు పళ్లను తోమడం, చక్కెర పదార్థాల వినియోగం తగ్గించడం, ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్ష చేయించుకోవడం వంటి సరళమైన అలవాట్లు అనేక సమస్యలను నివారించ గలవు. పాఠశాల స్థాయిలో మౌఖిక ఆరోగ్య పాఠ్యాంశాలు చేర్చడం, తల్లిదండ్రులలో అవగాహన పెంచడం ద్వారా సమాజం మొత్తం లాభపడుతుంది. ఈ దిశగా దంత వైద్యుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. జాతీయ దంత వైద్యుల దినోత్సవం కేవలం ఒక వృత్తి గౌరవదినం మాత్రమే కాదు; ఇది ప్రజారోగ్య చైతన్య దినం. దంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యక్తిగత స్థాయిలోనే కాక సామాజిక ఆర్థిక స్థాయిలోనూ నష్టాలు కలుగుతాయి. పని దినాల నష్టం, చికిత్స ఖర్చులు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స వంటి అంశాలు దేశ ఆర్థిక వ్యవస్థపై భారంగా మారుతాయి. నివారణే ఉత్తమ చికిత్స అనే సూత్రాన్ని అనుసరించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. భవిష్యత్తు దృష్ట్యా దంత వైద్య రంగం మరింత సాంకేతిక ఆధారితంగా మారుతోంది. త్రిమితి ముద్రణ పద్ధతులు, డిజిటల్ ఎక్స్-రేలు, కృత్రిమ మేధస్సు ఆధారిత నిర్ధారణ పద్ధతులు రంగంలో ప్రవేశిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు టెలీ-డెంటిస్ట్రీ సేవలను విస్తరించడం ద్వారా నిపుణుల సలహాలు సులభంగా అందించవచ్చు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో చౌకగా, అందుబాటులో ఉండే సేవలను అందించడం కాలానుగుణ అవసరం. మొత్తం మీద జాతీయ దంత వైద్యుల దినోత్సవం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది?నోటి ఆరోగ్యం మన సమగ్ర ఆరోగ్యానికి ద్వారం. దంత వైద్యులు ఆ ద్వారం వద్ద నిలబడి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే కవచంలా పనిచేస్తున్నారు. వారి సేవలను గౌరవించడం మాత్రమే కాక, ప్రతి పౌరుడూ దంత శుభ్రతను జీవితశైలిగా స్వీకరించడం ద్వారా ఈ దినోత్సవానికి నిజమైన అర్థం తీసుకురాగలం. ఆరోగ్యవంతమైన చిరునవ్వు ప్రతి మనిషి హక్కు. ఆ చిరునవ్వును నిలబెట్టే దంత వైద్యులకు జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా కృతజ్ఞతాభివందనం తెలియ జేయడం సమాజం తరపున ఒక కర్తవ్యంగా భావించాలి.

# తెలంగాణలో భానుడి భగభగ...

తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగతో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. గురువారం ములుగు జిల్లా మంగపేటలో అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో 38.9 డిగ్రీలు, మంచిర్యాలలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ములుగు, ఆదిలాబాద్, జగిత్యాల, ఖమ్మం, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, కుమురంభీమ్, నాగర్ కర్నూలు, నిజామాబాద్ తదితర జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## విధ్వంసం చేయకుండానే మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చు

విధ్వంసం చేయకుండా, ఎవరి ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూసీ పరివాహక ప్రాంతంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామని గుర్తు చేశారు. ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు.హైదరాబాద్ నగరంలోని నాగోల్‌లో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ రూ.16 వేల కోట్లతోనే ఆ పనులు చేయవచ్చని అన్నారు.

మూసీ సుందరీకరణ పనులను తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని అన్నారు. పైగా ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తామని

అన్నారు. హామీల అమలు కోసమే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని అన్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఇంటిని నిర్మించినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు.

## టోలీచౌకిలో ఘోర ప్రమాదం.. భవనంపై నుండి పడి కార్మికులు మృతి

హైదరాబాద్‌లోని టోలీచౌకిలో ఘోర ప్రమాదం జరిగింది. నాలుగు అంతస్తుల భవనం నిర్మాణం కోసం కట్టిన గోవా కర్రలు కూలి నలుగురు కార్మికులు మృతి చెందగా, ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం సమయంలో 10 నుండి 12 మంది కార్మికులు పని చేస్తున్నట్లు తెలుస్తోంది. భవనం నిర్మాణం కోసం గోవా కర్రలతో కట్టిన పరంజా కుప్పకూలడంతో ఘటనా స్థలంలోనే ముగ్గురు చనిపోయారు. ఆసుపత్రికి తరలిస్తుండగా ఒకరు మృతి చెందారు. ప్రమాదంలోని బాధితులంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారని తెలుస్తోంది. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా భవనం నిర్మిస్తుండటమే ఈ ప్రమాదానికి కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి.ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, రెవెన్యూ, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బిల్డర్ పరారీలో ఉన్నట్లుగా వార్తలు వస్తున్నాయి.

## హైదరాబాద్ ను క్రీడాహబ్ గా మారుస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాలిఫై విమెన్ హాకీ టోర్నమెంట్ 2026 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మెన్ శివసేన రెడ్డి , ఎండీ సోని బాలదేవిలతో కలిసి మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ ను క్రీడా హబ్ గా తయారు చేస్తున్నామని , స్పోర్ట్స్ యూనివర్సిటీ ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మార్చి 8 నుంచి 14 వరకు జరిగే ఈ పోటీలు గచ్చిబౌలిలోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరుగుతాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, వేల్స్ జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఇందులో నుండి మూడు జట్లు మహిళ హాకీ వరల్డ్ కప్ లో పాల్గొంటాయన్నారు. టోర్నమెంట్‌ను లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని సదుపాయాలను చేసిందని , అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రోటర్ఫ్

మైదానం, హై సెక్యూరిటీ, ఆధునిక సదుపాయాలు, క్రీడాకారులకు అత్యుత్తమ వసతి ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు.అనంతరం మార్చి 8 నుంచి జరిగే ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాలిఫై ఉమెన్ హాకీ టోర్నమెంట్ కు రావాలని సీఎం రేవంత్ రెడ్డి ని ఆహ్వానించారు మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ అఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ సోనీ బాలా దేవి.

## తిరుపతిలో కవిత నోట 'జై ఆంధ్ర' నినాదం

- మొదటి పేజి తరువాయి

తన రాక సందర్భంగా ఏపీలోని శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారని కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో తాము ప్రారంభించబోతున్న రాజకీయ పార్టీకి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతున్నానని అన్నారు.మరోవైపు, తనను ఇబ్బంది పెట్టిన కేసుల నుంచి కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కవిత హర్షం వ్యక్తం చేశారు. సత్యం తన వైపు ఉన్నందునే దైవకృపతో కేసుల నుంచి విముక్తి లభించిందని, ఆ మొక్కు తీర్చుకునేందుకే అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు వెళుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా తాను స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీకి శ్రీవారి ఆశీస్సులు ఉంటాయని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ అస్తిత్వం ప్రాతిపదికగా తన రాజకీయ ప్రయాణం ఉంటుందని చెబుతున్న కవిత, ఏపీలో 'జై ఆంధ్ర' అనడం వెనుక వ్యూహాత్మక కారణాలు ఏమైనా ఉన్నాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీ సెటిలర్ల ఓట్లు ఏ ఎన్నికల్లోనైనా కీలకంగా మారుతుంటాయి. ఈ నేపథ్యంలో, వారిని ఆకట్టుకోవడానికి

కవిత ఈ నినాదాన్ని వాడుకున్నారా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు వెళుతున్నారు. రేపు ఉదయం స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ పర్యటన ముగిసిన వెంటనే తన కొత్త పార్టీ పేరు మరియు విధివిధానాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## ముగిసిన నితీశ్ శకం..

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాం శమైంది. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ నేపథ్యంలో, బీహార్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది.ప్రస్తుత అంచనాల ప్రకారం, కొత్త ప్రభుత్వంలో బీజేపీ ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోనుంది. ఈ రేసులో ప్రధానంగా ముగ్గురు నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వారు ఎవరంటే...? సామ్రాట్ చౌదరి: ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి సీఎం రేసులో అందరికంటే ముందున్నారు. ఓబీసీ (కుష్వాహా) సామాజికవర్గానికి చెందిన ఆయనకు పార్టీలో, ప్రభుత్వంలో పట్టు ఉండటం ప్లస్ పాయింట్. నిత్యానంద రాయ్: కేంద్ర మంత్రిగా ఉన్న నిత్యానంద రాయ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. యాదవ సామాజికవర్గానికి చెందిన ఈయనను సీఎంగా చేయడం ద్వారా,

ఆర్జేడీ (తేజస్వి యాదవ్) ఓటు బ్యాంకుకు గండి కొట్టాలని బీజేపీ భావిస్తోంది. అమిత్ షాతో నిత్యానంద రాయ్ కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దిలీప్ జైశ్వాల్: బీహార్ మంత్రి దిలీప్ జైశ్వాల్ పేరు కూడా పరిశీలనలో ఉంది. వైశ్య సామాజికవర్గానికి చెందిన ఈయనకు పార్టీ అధిష్ఠానం వద్ద మంచి గుర్తింపు ఉంది.

### గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ కేబినెట్ సబ్ కమిటీ

- మొదటి పేజి తరువాయి

వసతి సముదాయాలు నిర్మించాలని ఆదేశించారు. రోజుకు రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ట్రాఫిక్, పార్కింగ్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### సీఎం సలహాదారు పదవికి వేం నరేందర్ రెడ్డి రాజీనామా

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభ రేసులోకి రావడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఆయన పేరును ఖరారు చేయడంతో, సాంకేతిక కారణాల దృష్ట్యా ఆయన తన ప్రభుత్వ సలహాదారు పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాంటి 'లాభదాయక పదవుల్లో' ఉండకూడదనే నిబంధన ఉండటంతో, నామినేషన్ దాఖలుకు ముందే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. వేం నరేందర్‌రెడ్డి రాజీనామాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆమోదించారు.రాజీనామా ప్రక్రియ ముగిసిన వెంటనే, వేం నరేందర్‌రెడ్డి మరో కాంగ్రెస్ అభ్యర్థి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో కలిసి అసెంబ్లీలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు ఆయన వెంట ఉన్నారు. తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ ఈ ఇద్దరినీ బరిలోకి దింపింది. అసెంబ్లీలో ఉన్న సంఖ్యాబలం దృష్ట్యా ఈ రెండు స్థానాలను కాంగ్రెస్ ఏకగ్రీవంగా దక్కించుకునే అవకాశం ఉంది.

### ఏపీ అసెంబ్లీలో అస్వస్థతకు గురైన హోంమంత్రి అనిత

- మొదటి పేజి తరువాయి

వరుస కార్యక్రమాలతో హోంమంత్రి తీరిక లేకుండా గడుపుతున్నారు. నిరంతర పని ఒత్తిడి, సరైన విశ్రాంతి లేకపోవడం వల్లే ఆమె నీరసించిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.హోంమంత్రి ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె వ్యక్తిగత సిబ్బంది స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని, విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు సూచించినట్లు సమాచారం. అంతా సవ్యంగా ఉంటే ఈ రోజు సాయంత్రానికే ఆమె ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

### సునీల్ నాయక్ ను 7 గంటల పాటు విచారించిన అధికారులు

- మొదటి పేజి తరువాయి

సునీల్ నాయక్ తొలిరోజు విచారణ ముగిసింది. ఈరోజు ఉదయం ప్రారంభమైన ఈ విచారణ, విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో గుంటూరులోని సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు 7 గంటల పాటు సుదీర్ఘంగా సాగింది. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరైన సునీల్ నాయక్, అధికారుల ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది.రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో ఉంచిన ఆ రాత్రి, సునీల్ నాయక్ పలుమార్లు ఆ కార్యాలయానికి వెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. దీనిపై అధికారులు ప్రశ్నించగా, ఆయన కేవలం అరకొర సమాధానాలతోనే సరిపెట్టినట్లు సమాచారం. సీఐడీ కార్యాలయంలో ఆ రాత్రి జరిగిన పరిణామాలు, ఎవరి ఆదేశాల మేరకు ఆయన అక్కడికి వెళ్లారు అనే కోణంలో పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు ఈ విచారణ కొనసాగాల్సి ఉంది. అంటే, మరో నాలుగు రోజుల పాటు ఆయన పోలీసుల ఎదుట హాజరుకావాల్సి ఉంటుంది. రాబోయే నాలుగు రోజుల్లో ఆయన ఎలాంటి వాంగ్మూలం ఇస్తారో, ఈ కేసులో ఇంకెవరి పేర్లు బయటకు వస్తాయో వేచి చూడాలి.

### అలా చేస్తే ఇజ్రాయెల్ అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటాం

తమ దేశంలో పాలన మార్పునకు ప్రయత్నిస్తే ఇజ్రాయెల్‌లోని డిమోనా అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది. పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య గత ఆరు రోజులుగా భీకర యుద్ధం సాగుతోంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడిలో మృతి చెందారు. ఖమేనీ మృతి చెందిన తర్వాత యుద్ధం మరింత ఉద్ధృతంగా మారింది.ఇజ్రాయెల్, అమెరికా తమ లక్ష్యాలను చేరుకున్నాయని, ఈ నేపథ్యంలో ట్రంప్ ఎప్పుడైనా యుద్ధాన్ని ఆపివేయవచ్చని వార్తలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఇజ్రాయెల్ అధికారి ఇరాన్‌లో పాలకులు మారే వరకు యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పాలకులను మార్చుతామంటూ ఇజ్రాయెల్ చేసిన ప్రకటనపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది.తమ దేశంలో పాలనను మార్చే ప్రయత్నం చేస్తే ఇజ్రాయెల్‌లోని అణు ప్లాంటును లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. అంతేకాకుండా పశ్చిమాసియాలో చమురు మౌలిక సదుపాయాలను తమ క్షిపణులు లక్ష్యంగా చేసుకుంటాయని పేర్కొంది.

### ఏపీలో జననాల రేటు దారుణంగా పడిపోతోంది

- మొదటి పేజి తరువాయి

ఆవశ్యకత ఏర్పడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సిద్ధం చేసిన ముసాయిదా పాలసీని సభలో ప్రవేశపెట్టారు.రాష్ట్రంలో జననాల రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్ - టీఎఫ్ఆర్) ఆందోళనకరంగా పడిపోతోందని ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరించారు. 1993లో 3.0గా ఉన్న ఫెర్టిలిటీ రేటు ప్రస్తుతం 1.5కు పడిపోయిందని తెలిపారు. జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ వంటి దేశాల్లో ఏర్పడిన క్లిష్ట పరిస్థితులే ఇప్పుడు ఏపీలోనూ కనిపిస్తున్నాయన్నారు. జననాల రేటు ఇలాగే వేగంగా తగ్గిపోతే భవిష్యత్తులో పనిచేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయి, ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇద్దరు పిల్లల కంటే తక్కువ ఉన్నవారికి రాజకీయ ప్రాతినిధ్యం దక్కదేమో అని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పుడు జోక్యం చేసుకోకపోతే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.ప్రస్తుత గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదవుతున్నాయని, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే 2047 నాటికి మన జనాభాలో 23 శాతం మంది వృద్ధులే ఉంటారని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే పాపులేషన్ మేనేజ్‌మెంట్ కోసం 'ఐదు అంచెల లైఫ్ సైకిల్' విధానాన్ని తెరపైకి తెచ్చినట్లు వెల్లడించారు. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని అనే ఐదు పిల్లర్ల ద్వారా మహిళ గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.మహిళల లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగా ఉందని, దీనిని 59 శాతానికి పెంచగలిగితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతానికి చేరుతుందని అంచనా వేశారు. సంతానోత్పత్తి సమస్యలతో బాధపడే దంపతులను ఆదుకునేందుకు 'మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపారు. ఇందులో భాగంగా పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) పద్ధతిలో తక్కువ ఖర్చుతో లేదా సబ్సిడీపై ఐవీఎఫ్ సేవలు అందించే ఆలోచనలో ఉన్నామన్నారు. అలాగే అనవసర సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం, ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజ్ గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తీసుకురావడం ఈ పాలసీ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ ముసాయిదా పాలసీని ప్రజల ముందు ఉంచుతున్నామని, దీనిపై రాబోయే నెల రోజుల పాటు విస్తృత చర్చ జరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అందరి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే దీనికి తుది రూపం ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



బౌరంపేట్‌లో ఇలా ఒకటే పిల్లర్ ఉన్నప్పుడు "జిపివో" పనులు నిలిపివేత..




సెటిల్మెంట్‌లతో రెవెన్యూ ఉదాసీనత ఇలా దర్జాగా పనులు ప్రారంభం..

# భూదాన్ భూముల్లో షెడ్లు..!
# కాలంచెల్లిన పట్టాలతో నిర్మాణాలు..!

**బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీని రెవెన్యూ దత్తత తీసుకుందా..?**

**భూదాన్ భూముల్లో షెడ్లకు.. కలెక్టర్ 'డి-నోటిఫికేషన్'ను ధిక్కరించి సహకారమా..?**

- తహశీల్దార్ భరోసా..? లేఅవుట్ పట్టాల పేరుతో చకచకా అక్రమ నిర్మాణాలు..!
- పాత పట్టాలు కట్టుకోవచ్చట..! తెలివిగా పరోక్షంగా సహకరిస్తున్న రెవెన్యూ..
- కాలం చెల్లిన ప్రభుత్వ పట్టాలు.. క్రయ విక్రయాల నిబంధనలకు తిలోదకాలు..
- పనికిమాలిన వ్యక్తుల సిఫార్సుల పేరుతో.. "లాభదాయకమైన" వ్యాపారమా..?

అటు గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో భారీ అక్రమ షెడ్ల వ్యవహారం లోనూ, అధికారులకు కనీస అవగాహన లేదని స్పష్టమవుతుంది.. సిఫార్సులకు ఇచ్చిన ప్రాధాన్యత, జిల్లా కలెక్టర్ ఇచ్చిన 'డి-నోటిఫికేషన్'కి ఇవ్వకపోవడం గమనార్హం.. ఒక జిల్లా కలెక్టర్ "డి-నోటిఫికేషన్"తో '22-ఎ జాబితా'లో పెట్టిన భూదాన్ భూమిలో.. రెండు అక్రమ షెడ్ల నిర్మాణాలపై తహశీల్దార్ సానుభూతి పలు విమర్శలకు దారితీస్తుంది.. "పెన్ పవర్" దినపత్రికలో వరుస కథనాలతో సంబంధిత స్థానిక అధికారులు, జిల్లా అడిషనల కలెక్టర్(రెవెన్యూ) దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం..! ప్రస్తుత కలెక్టర్ చర్యలు తీసుకోవద్దని చెప్పారని రెవెన్యూ సిబ్బంది తమపై అధికారులకు చెబుతున్నారు. అది ఓ ప్రజా ప్రతినిధికి చెందిన షెడ్డు అని కూడా మండల అధికారులు తమ పైస్థాయి అధికారులకు చెప్పడం గమనార్హం.. ఇక్కడ హాస్యాస్పద విషయం ఏమిటంటే..! మేడ్చల్ జిల్లాలో అధికార యంత్రాంగం ఎవరు ఎవరికి "సుపీరియర్" ఎవరు ఎవరికి "సబార్డీనేట్" అనేది చర్చనీయాంశంగా మారింది..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 5:**

దుండిగల్ మండలంలో రెవెన్యూ అధికారుల పనితీరు పలు విమర్శలకు తావిస్తోంది.. "కంచే చేను మేసిన" చందంగా తయారైంది.. ప్రభుత్వ పట్టాల కాలపరిమితి- వాటి క్రయవిక్రయాల నిబంధనల గురించి తహశీల్దార్ స్థాయి అధికారికి కూడా అవగాహన లేకపోవడం బాధాకరం.. బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో అధికారుల కనుసన్నల్లో ఈ అక్రమ కట్టడాల యవ్వారం "మూడు బేస్మెంట్‌లు- ఆరు అక్రమ నిర్మాణాలు"గా విరాజిల్లుతోంది..! రెవెన్యూ యంత్రాంగం భూ పరిరక్షణ కోసమా..? లేక కబ్జాదారుల ప్రలోభాలకు కట్టుబడి ప్రభుత్వ భూములు కట్టబెట్టడమా..? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.. దుండిగల్ మండలం బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో సర్వే నెం.576 ప్రభుత్వ భూమిలో కాలం చెల్లిన ప్రభుత్వ పట్టాల వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమని అధికారులే నిరూపిస్తున్నారు..

-4లో

- దుండిగల్ తహశీల్దార్‌కు గ్రూపులో..! ఆర్ఐకి పర్సనల్‌గా..! పంపించినా చర్యలు శూన్యం.
- మరో నిర్మాణం గురించి అడిగితే..! స్థానికుల పాత పట్టాలు ఉన్నాయని జవాబు..
- గాగిల్లాపూర్ భూదాన్ భూమిలోనూ అక్రమ షెడ్లకు ప్రజాప్రతినిధి సిఫార్సులట..
- డి.పోచంపల్లి సర్వే నెం.120లో "58-59" పేరుతో అక్రమ నిర్మాణాలకు సహకారం..
- ఓవైపు సిఫార్సుల అమలు..! మరోవైపు అక్రమ నిర్మాణ దారులకు అండగా..!

భూదాన్ భూమిలో అక్రమ షెడ్డు.. 2025 డిసెంబర్ 1న.. ఈదశలో తహశీల్దార్ దృష్టికి..




కలెక్టర్ డి-నోటిఫికేషన్ అయినప్పటికీ తహశీల్దార్ సౌజన్యంతో (2025 డిసెంబర్ 21) ఇలా పూర్తి..




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రైవేట్ స్కూల్స్ ప్రొఫెషనల్ ట్యాక్స్ కట్టాలి





**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలోని ప్రైవేట్ స్కూళ్లకు విద్యాశాఖ కీలక ఆదేశాలిచ్చింది. ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లించాలని ఆదేశించింది. ట్యాక్స్ వసూలు చేసే బాధ్యత డీఈవోలకు అప్పగించింది. ట్యాక్స్ వసూలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ హెచ్చరించింది. ట్యాక్స్ వసూలులో నిర్లక్ష్యంగా ఉంటే అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపింది..విద్యాశాఖపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించిన సంగతి తెలిసిందే.ఇప్పటికే రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల దందాకు చెక్ పెట్టేందుకు సర్కారు సిద్ధమైంది. ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచే ఆనవాయితీకి బ్రేక్ వేస్తూ.. శాస్త్రీయంగా ఫీజులను నిర్ణయించే ప్రక్రియను స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు వేగవంతం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11 వేల ప్రైవేటు స్కూళ్లలో ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజులు, గత మూడేండ్ల ఆదాయ, వ్యయాల వివరాలను సేకరించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు.

-4లో

# రూ.35,000 లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన జీహెచ్ఎంసీ అధికారి

- సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో పట్టుకున్న ఏసీబీ
- అకౌంట్స్ విభాగంలో ఎగ్జామినర్‌గా పనిచేస్తున్న సంతోష్
- పెన్షన్ ప్రాసెస్ చేయడానికి రూ.40 వేలు లంచం డిమాండ్ చేసిన సంతోష్

-4లో



# భూదాన్ భూముల్లో షెడ్లు..! కాలంచెల్లిన పట్టాలతో నిర్మాణాలు..!



దుండిగల్ ఆర్ఐ సౌజన్యంతో భూదాన్ భూమిలో ఇలా ఇష్టంలేని మొక్కుబడి చర్యలు..



దొమ్మర పోచంపల్లి విద్యుత్ శాఖ ఘనకార్యం.. రెవెన్యూ కూల్చిన షెడ్డుకు ట్రాన్స్‌ఫార్మర్..



బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో నాగరాజు బేస్మెంట్‌ను అక్టోబర్ 11న రెవెన్యూ కూల్చివేత.. ఫైల్‌ఫొటో..

## 22-ఏ నుంచి తొలగింపుకు దరఖాస్తులతో బట్టబయలు..

ఈ భూదాన్ భూముల్లోనే గతంలో (బహుశా బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో) కొన్ని సందర్భాల్లో "ఎన్‌వోసి"లు జారీచేసి, ఆ తర్వాత నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించబడినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌లోని "టిఎం-15" మాడ్యూల్ ద్వారా సర్వే నెంబర్ 150లో 01-05 ఎకరాలు, మరియు 151లో 01-07 ఎకరాలకు, సంబంధించిన భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించేందుకు వచ్చిన దరఖాస్తులతో బండారం బయటపడింది.. ఆ దరఖాస్తులపై అప్పటి దుండిగల్ తహసీల్దార్, మల్కాజిగిరి ఆర్డీవోలు చేపట్టిన కూలంకష విచారణలో దిమ్మతిరిగే నిజాలు బట్టబయలు అయ్యాయి.. విచారణలో భాగంగా పరిశీలించిన రికార్డుల ప్రకారం, సర్వే నెంబర్ :150 , 151 జి.ఓ.ఎం.ఎస్ నెం.286 (09-03-2005) ప్రకారం భూదాన్ భూములను 22-ఎ నిషేధిత జాబితాలో ఉన్నట్లు విచారణలో తేలినట్టు కలెక్టర్ లేఖలో పేర్కొన్నారు..

**మేడ్చల్ జిల్లా గండిమైసమ్మదుండిగల్ మండలం గాగిల్లాపూర్ గ్రామ పరిధిలోని భూదాన్ భూములపై ప్రభుత్వం కీలక హెచ్చరిక చేసింది.. సర్వే 138, 139, 140, 141, 142, 143, 144, 145, 146, 147, 148, 150, 151, 155, 161, 165లలో ఉన్న మొత్తం 77 ఎకరాలు 19 గుం. భూములు.. ఈ భూముల జాబితాను జిల్లా కలెక్టర్ రిజిస్ట్రేషన్ శాఖకు పంపించడంతో, వాటిని రిజిస్ట్రేషన్ చట్టం1908లోని సెక్షన్ 22-ఎ ప్రకారం మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చి, రిజిస్ట్రేషన్‌లు నిలిపి వేయాలని జిల్లా రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. తీసుకున్న చర్యలపై 23 ఫిబ్రవరి 2025లోపు నివేదిక సమర్పించాలని కూడా ఆదేశించారు.. భూదాన్ భూములు ప్రభుత్వ నియంత్రణలోనే ఉండాలన్న ఉద్దేశంతో అక్రమ రిజిస్ట్రేషన్లు, లావాదేవీలకు అడ్డుకట్ట వేయడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు..**

- 3 పేజి తరువాయి

ప్రభుత్వ ఉద్యోగం అంటే తమ పూర్వీకుల నుండి వంశపారంపర్యంగా వస్తున్న పదవి కాదు.. ప్రజలకు సేవకులుగా, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు, ప్రభుత్వ నియమావళికి అనుగుణంగా పారదర్శకత విధులు నిర్వర్తించేందుకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు మాత్రమే..! అయితే ఆ అర్థాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని తేటతెల్లం చేస్తోంది.. అధికారమనే ముసుగులో చట్టాలను, నిబంధనలను కాలరాస్తున్నారు.. సిఫార్సులకు-పాత పట్టాల నిర్మాణాలకు చట్టబద్ధత కల్పించారా..? అంటే అదేమి లేదు..! "తానే రాజు- తానే మంత్రి" అనే నియంతృత్వ ధోరణితో విధులు నిర్వర్తించడాన్ని ఏమంటారో మీరే చెప్పాలి..! అధికార దుర్వినియోగం అనాలా..? లేక అధికారమే తప్పుదోవలో పయనిస్తోందా..? ఇందుకే కదా..! గత ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థ పనితీరుతో "విఆర్‌వో-విఆర్ఏ"లను ఇతర శాఖలకు బదిలీ చేసింది..! అయినప్పటికీ ఇప్పుడు అదే విఆర్‌వోలను "జిపివో"(గ్రామ పాలనా అధికారి)ల పేరుతో తీసుకుని..! మళ్ళీ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు.. మండలానికి సుమారు "3 నుండి 5 వరకు" జిపివోల నియామకం జరిగింది.. అయితే ఆ జిపివోలు ఏం చేస్తున్నారు..? అక్రమ నిర్మాణాల వద్దకు పదే పదే వెళ్తున్నా చర్యలు చేపట్టక పోవడానికి కారణం..? మరోవైపు తహశీల్దార్, ఆర్ఐల ఆదేశానుసారమే చర్యలు తీసుకోలేక పోతున్నారని అనుకోవాలా..? లేక "తిలాపాపం తలాపిడికెడు" అన్న చందంగా వ్యవహరిస్తున్నారని భావించాలా..?

## భూదాన్ భూములపై ఏడాది క్రితమే కలెక్టర్ స్పష్టీకరణ..

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా, గండిమైసమ్మదుండిగల్ మండలం పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామంలో భూదాన్ భూములుగా నమోదైన పలు సర్వే నెంబర్‌లపై, గతంలో జారీ చేసిన "ఎన్‌వోసి"లను రద్దు చేసి, రిజిస్ట్రేషన్‌లు కూడా నిలిపి వేయాలంటూ, అప్పటి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.. "కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంపుల శాఖకు" 28 జనవరి 2025 తేదీన నాటి కలెక్టర్ లేఖ రాశారు.. ఈ లేఖలో గాగిల్లాపూర్ గ్రామ పరిధిలోని భూదాన్ భూముల "డి-నోటిఫికేషన్" అంశాన్ని స్పష్టంగా వివరించారు.. గాగిల్లాపూర్ సర్వే నెంబర్‌లు 138, 139, 140, 141, 142, 143, 144, 145, 146, 147, 148, 150, 151, 155, 161 మరియు 165 లలో మొత్తం 77-19 ఎకరాల భూదాన్ భూములు నమోదై ఉన్నట్టు రెవెన్యూ పరిశీలనలో(ఆర్డీవో- తహశీల్దార్) తేలిందని కలెక్టర్ పేర్కొన్నారు..



నాగరాజుకు చెందిన బేస్మెంట్ కూల్చేసిన ఆర్ఐ అండతోనే, నిర్మాణం పూర్తి ఇలా..

బౌరంపేట్‌లో జగన్నాథ్ రెడ్డి అక్రమ కట్టడం ఇలా గుంతల దశలో.. ఫైల్‌ఫొటో..







దుండిగల్ రెవెన్యూ సౌజన్యంతో.. జగన్నాథ్ రెడ్డి నిర్మాణం పూర్తి.. మార్చి 3న ఇలా..

## ఇందిరమ్మ కాలనీలో ముడుపుల నిర్మాణాలు..?

గండిమైసమ్మ దుండిగల్ మండలంలో, ప్రభుత్వ భూములు కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం.. అక్రమార్కులకు కట్టబెట్టేందుకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తుంది.. బౌరంపేట్ సర్వే నెంబర్ 576 ప్రభుత్వ భూమిలో 2007లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 561+22 ప్లాట్లతో, కొన్ని పార్కులను కూడా లేఅవుట్‌లో చూపుతూ పేదలకు పట్టాలు జారీచేసింది.. మొత్తం 583 ప్లాట్‌లు లబ్దిదారులకు జారీచేశారు.. లేఅవుట్ నిర్మాణంలో కొన్ని పట్టాలు కత్వ చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లోనూ ఉన్నట్లు సమాచారం.. ప్రభుత్వ పట్టాల జారీతో కొన్ని నిబంధనలు కూడా పొందుపరిచారు.. 6-12 నెలల లోపు నిర్మాణం చేపట్టక పోయినా..! సంబంధిత పట్టాలు లబ్దిదారులు విక్రయించినా..! ఇతరులు ఎవరైనా కొనుగోలు చేసినా సంబంధిత పట్టలాను రద్దుచేస్తూ, ప్లాట్‌ల స్థలాలు ప్రభుత్వం స్వాధీన పరచుకోవాలనే నిబంధనలు, రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. కంచే చేను మేసిన చందంగా, ప్రభుత్వ నిబంధనలను రెవెన్యూ అధికారులే కాల రాస్తున్నారు..!

కాలం చెల్లిన ప్రభుత్వ పట్టాలతో నిర్మించే అక్రమ కట్టడాలను అడ్డుకుంటే తమపై కేసువేస్తారని ఒక అవగాహన లేని అధికారి సమాధానం లోనే స్పష్టత నిస్తుంది.. 60 గజాల అక్రమ నిర్మాణానికి రూ.లక్ష వరకు చెల్లించే విధంగా ధరను నిర్ణయించినట్లు సమాచారం.. అందుకే ఎలాంటి ఆటంకాలు లేకుండా యధేచ్ఛగా అక్రమ కట్టడాల పరంపర కొనసాగుతుందని విమర్శలు ఉన్నాయి.. బాధ్యత లేని అధికారుల విధుల్లో "చట్టాలు-నిబంధనలు" నిర్వీర్యం అవుతున్నాయి..!





బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో కాలంచెల్లిన పట్టాలతో అక్రమ కట్టడం నివాసానికి..





బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో పాత పట్టాల కొత్త కమర్షియల్ నిర్మాణం..

## రూ.35,000 లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన జీహెచ్ఎంసీ అధికారి

**హైదరాబాద్ పెన్ పవర్:**జీహెచ్ఎంసీ అధికారి ఒకరు ఏసీబీకి చిక్కారు. సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలోని అకౌంట్స్ విభాగంలో ఎగ్జామినర్‌గా పనిచేస్తున్న సూర్యవంశీ సంతోష్ రూ.35 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగి పెన్షన్ ప్రాసెస్ చేయడానికి గాను సంతోష్ రూ.40 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఈ క్రమంలో కార్యాలయంలో రూ.35,000 తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఈ సందర్భంగా ఏసీబీ ప్రజలకు సూచన జారీ చేసింది. ఒకవేళ ఏ ప్రభుత్వ సేవకుడైనా లంచం అడిగినట్లయితే అవినీతి నిరోధక శాఖ వారి టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపింది. అంతేకాకుండా వివిధ సామాజిక మాధ్యమాలు వాట్సాప్ (9440446106), ఫేస్ బుక్ (Telangana ACB), ఎక్స్ (TelanganaACB), వెబ్ సైట్ (http://acb.telangana.gov.in ) ద్వారా కూడా అవినీతి నిరోధక శాఖ అధికారులకు సమాచారం అందించవచ్చని సూచించింది. ఫిర్యాదుదారుల లేదా బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొంది.

## ప్రైవేట్ స్కూల్స్ ప్రొఫెషనల్ ట్యాక్స్ కట్టాలి: విద్యాశాఖ ఆదేశాలు

-3 పేజి తరువాయి

ప్రతి రెండేండ్లకోసారి 8 శాతం మాత్రమే ఫీజు పెంచుకునేలా ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు ముమ్మరమైంది. ఎంఈఓలు, డీఈఓల ఆధారంగా ఏ స్కూళ్లో ఎంత ఫీజు ఉంది? ఏఏ క్లాసులకు ఎంతెంత తీసుకుంటున్నారు?అనే వివరాలను సేకరిస్తోంది. ప్రైవేటు స్కూళ్లలో దేని ఆధారంగా బేస్ ఫీజులను నిర్ణయించాలనే దానిపై అధికారులు కసరత్తు చేశారు.

### త్వరలో పబ్లిక్ లోకి ఫీజుల డ్రాఫ్ట్

ఫీజుల డ్రాఫ్ట్ ను పారదర్శకంగా వెబ్‌సైట్‌లో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై పేరెంట్స్, స్టూడెంట్లు, విద్యావేత్తలు, ప్రజల అభిప్రాయాలను, సూచనలు సేకరించనున్నారు. ఆ తర్వాతే దాన్ని ఫైనల్ చేయాలని సర్కారు డిసైడ్ అయింది. డీఎఫ్?ఆర్సీ నిర్ణయించిన ఫీజుల వివరాలనూ ఏ స్కూల్ ఎంత వసూలు చేయబోతోందనే డేటాను వెబ్ సైట్? టో పెట్టనున్నారు.

# ఖమ్మం అడవుల్లో కెమెరా ట్రాప్లకు చిక్కిన చిరుతపులి, ఎలుగుబంటి సంచారం

**ఖమ్మం పెన్ పవర్:**
ఖమ్మం జిల్లాలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో అటవీ శాఖ ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్లలో ఇటీవల చిరుతపులి (ఘుత్ప్రవత్ఘు జూఘుతీఎబం) మరియు ఎలుగుబంటి (వీవశ్రీబతీంబం బతీంఱఅబం) సంచారానికి సంబంధించిన దృశ్యాలు నమోదయ్యాయి. ఈ పరిణామం జిల్లాలోని అటవీ పర్యావరణ వ్యవస్థలో వన్యప్రాణుల ఆరోగ్యకరమైన జీవనానికి నిదర్శనంగా నిలుస్తోంది.
వన్యప్రాణుల జనాభాను శాస్త్రీయంగా పర్యవేక్షించడానికి మరియు జీవవైవిధ్య నమూనాలను అర్థం చేసుకోవడానికి అటవీ శాఖ నిరంతరం కృషి చేస్తోంది. ఖమ్మం జిల్లా పరిధిలోని అడవుల్లో మెరుగైన ఆవాస పరిస్థితులు మరియు పర్యావరణ సమతుల్యత వల్లే ఈ వన్యప్రాణుల ఉనికి సాధ్యమైందని అధికారులు తెలిపారు.గడిచిన ఏడాది కాలంగా ఖమ్మం జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ శాఖ పలు కీలక చర్యలు చేపట్టింది:

**నీటి వనరుల నిర్వహణ:**
వేసవి కాలంలో వన్యప్రాణుల దాహం తీర్చడానికి అటవీ ప్రాంతాల్లో శాస్త్రీయ పద్ధతిలో నీటి కుంటల నిర్వహణ.

**అధునాతన నిఘా:**
సమస్యాత్మక అటవీ ప్రాంతాలలో 360–డిగ్రీల నిఘా కెమెరాల ఏర్పాటు.

**వేటగాళ్లపై చర్యలు:**
అడవుల్లో వేటను అరికట్టడానికి ముమ్మర తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడం.

**డ్రోన్ పర్యవేక్షణ:**
అడవుల పర్యవేక్షణ మరియు వన్యప్రాణుల కదలికలను గమనించడానికి సరికొత్త డ్రోన్ టెక్నాలజీని వినియోగించడం.

**పులిగుండల ఎకో–టూరిజం:**
ప్రకృతిపై అవగాహన పెంచడం మరియు స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా పులిగుండల ఎకో–టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేయడం.
అటవీ అంచున ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి సమయాల్లో అడవిలోకి వెళ్లకూడదని, వన్యప్రాణుల ఆవాసాలకు ఇబ్బంది కలిగించవద్దని అటవీ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. నివాస ప్రాంతాల సమీపంలో వన్యప్రాణుల సంచారం కనిపిస్తే వెంటనే సమీప అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఖమ్మం జిల్లా అటవీ సంపదను మరియు వన్యప్రాణులను కాపాడటంలో స్థానిక ప్రజలు తమ సహకారాన్ని కొనసాగించాలని కోరారు.






## ఎర్ధనూరు లోపర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ



**సంగారెడ్డి, మార్చి 5 పెన్ పవర్:** గురువారం కంది మండలం ఎర్ధనూరు శివారులో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం అదనపు కలెక్టర్ మాధురి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేందర్, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించడానికి ఉద్దేశించబడింది.

## 7న ధర్నా జయప్రదం చేయాలి

**ఆందోల్, మార్చి 5 పెన్ పవర్:** డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఈనెల 7వ తేదీన హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని టిపియుఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వం 2003 డిఎస్సి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు.

## కోహీర్ వార్డుల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



**జహీరాబాద్, మార్చి 5 పెన్ పవర్:** కోహీర్ మున్సిపల్ వార్డుల్లో చైర్మన్ మ్యాతరి అశోక్ ఆధ్వర్యంలో ఎక్కల్ దేవి కుంటలో అభివృద్ధి పనులు గురువారం ప్రారంభమయ్యాయి. రోడ్ల మరమ్మతు పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి చైర్మన్ ప్రారంభించారు. త్వరలో మున్సిపల్ కమిషనర్ అధికారిని నియమిస్తామని, గ్రామంలోని పదహారు వార్డుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అన్వన్ జావీద్, పట్టణ అధ్యక్షులు శంషీర్ అలీ, కౌన్సిలర్లు రఫిక్ బాయ్, మహమ్మద్ హైమద్, శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు జగదీశ్, గోపాల్, ఆనంద్, అశోక్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ దరఖాస్తు గడువు పొడిగింపు

**నారాయణఖేడ్, మార్చి 5 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తు గడువును మార్చి 10వ తేదీ వరకు పొడిగించినట్లు రాయికోడ్ ఎంఈఓ జి నర్సింలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పొడిగింపుతో ఎక్కువ మంది విద్యార్థులకు మోడల్ స్కూల్లో ప్రవేశం పొందే అవకాశం లభించింది.

## శ్రీ దుర్గా భవానీ ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

**పటాన్చెరు, మార్చి 5 పెన్ పవర్:** సంగారెడ్డి మండలం ఈశ్వరపురం ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామంలో కొలువైన సప్తప్రాకారయుత శ్రీ దుర్గా భవానీ ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి జాతర ఉత్సవాలు ఐదు రోజుల పాటు వైభవంగా జరుగుతాయని ఆలయ ధర్మాధికారి బ్రహ్మశ్రీ కమలంపేట రాధాకృష్ణమూర్తి శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి నిత్యం రుత్విక్ లచే మహా రుద్ర పురశ్చరణ ఆయుత శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణములు, హవనములు జరుగుతాయి. అలాగే, దాతలైన భక్తులచే మహా రుద్రాభిషేకం, శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ పూర్వక సామూహిక కుంకుమార్చన కూడా నిర్వహిస్తారు.

# తృణమూల్ ఎంపీగా హైదరాబాదీ...

**హైదరాబాద్, మార్చి 5 పెన్ పవర్:**
తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో మరోసారి తనదైన ముద్ర వేశారు. రాజకీయాలకు అతీతంగా, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని పార్లమెంటుకు పంపే సంప్రదాయాన్నికొనసాగిస్తూ, ఈసారి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామిని బరిలోకి దింపారు. ఈ ఎంపిక భారత పార్లమెంటరీ చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి తెరలేపడమే కాకుండా, తెలంగాణ గడ్డ గర్వించదగ్గమరో మైలురాయిగా నిలవనుంది.మేనకా గురుస్వామి కేవలం సుప్రీంకోర్టులో పేరున్న న్యాయవాది మాత్రమే కాదు, ఆమె మూలాలు తెలంగాణలో ఉన్నాయి. ప్రముఖ ఆర్థికవేత్త, రాజకీయ విశ్లేషకులు మోహన్గురుస్వామి కుమార్తెగా ఆమెకు మేధోపరమైన వారసత్వం అందింది. ఆక్స్ఫర్డ్, హార్వర్డ్ వంటి ప్రపంచ ప్రసిద్ధ విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన మేనక, ఐక్యరాజ్యసమితి న్యాయ విభాగంలోనూ సేవలందించారు. అటుఅంతర్జాతీయ వేదికలపై, ఇటు దేశ అత్యున్నత న్యాయస్థానంలో సంక్లిష్టమైన కేసులను వాదించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.మేనకా గురుస్వామి పేరు దేశవ్యాప్తంగా మారుమోగడానికి ప్రధానకారణం 'సెక్షన్ 377' పై ఆమె చేసిన న్యాయపోరాటం. బ్రిటిష్ కాలం నాటి స్వలింగ సంపర్క వ్యతిరేక చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఆమె వినిపించిన వాదనలు చారిత్రాత్మకమైనవి. ఎల్జీబీటీక్యూ వర్గాలహక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఆమె, వ్యక్తిగతంగా కూడా ఆ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పుడు రాజ్యసభకు ఎన్నికైతే, భారత పార్లమెంటులో అడుగుపెట్టిన తొలి 'ఓపెన్లీ ఎల్జీబీటీక్యూ' ఎంపీగాఆమె రికార్డు సృష్టించనున్నారుఇటీవలి కాలంలో జాతీయ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ కేసులోనూ మేనక తన న్యాయ ప్రతిభను చాటారు. ముఖ్యంగా సిబిఐ వాడిన "సదరన్ గ్రూప్" అనే పదంనిందితులకు ఆపాదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆమె చేసిన న్యాయపోరాటం సత్ఫలితాలను ఇచ్చింది. రాజకీయంగా అత్యంత సున్నితమైన కేసులలో కూడా తలపండిన న్యాయవాదిగా ఆమె తన పట్టునునిరూపించుకున్నారు. గతంలో సాగరికా ఘోష్ వంటి జర్నలిస్టులను రాజ్యసభకు పంపిన మమత, ఇప్పుడు మేనకా గురుస్వామిని ఎంపిక చేయడం వెనుక స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. పార్లమెంటులో చట్టాల రూపకల్పన సమయంలో రాజ్యాంగబద్ధమైన, న్యాయపరమైన లోతుపాతులు తెలిసిన వ్యక్తులు ఉండటం తృణమూల్ కాంగ్రెస్కు జాతీయ స్థాయిలో బలాన్ని ఇస్తుంది. సామాజిక హక్కుల కోసం పోరాడే వ్యక్తిని ఎంపీగాపంపడం ద్వారా టీఎంసీ ఒక లిబరల్, ప్రోగ్రెసివ్ పార్టీగా తన ఇమేజ్ను పెంచుకోవాలని చూస్తోంది. బెంగాల్ నుంచి ఇతర ప్రాంతాల మేధావులను ఎంపిక చేయడం ద్వారా పార్టీని కేవలం ఒక ప్రాంతీయ శక్తిగా కాకుండా
జాతీయ శక్తిగా ప్రాజెక్ట్ చేసే ప్రయత్నం జరుగుతోంది.తెలంగాణ బిడ్డగా, రాజ్యాంగ రక్షకురాలిగా, సామాజిక హక్కుల గొంతుకగా మేనకా గురుస్వామి ప్రస్థానం స్ఫూర్తిదాయకం. కేవలం న్యాయవాదిగానే కాకుండా,పార్లమెంటేరియన్గా ఆమె దేశ చట్టసభల్లో ఎటువంటి మార్పులు తీసుకువస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒక తెలుగు మహిళ పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించడం మనందరికీగర్వకారణం. మార్చి 16న జరిగే ఎన్నికల తర్వాత ఆమె పార్లమెంటులో అడుగుపెట్టడం ఖాయంగా కనిపిస్తోంది.

# మహిళలకు పెట్రోల్ బంకులు

**హైదరాబాద్, మార్చి 5, పెన్ పవర్:**
మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రతిష్టాత్మక ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం కింద అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాల్లో మహిళలతో పెట్రోల్ పంపులను ఏర్పాటు చేయడానికి చర్యలు ప్రారంభించింది.ఈ పెట్రోల్ బంకులను ఏరియా లెవల్ ఫెడరేషన్లు(ఏఎల్ఎఫ్), టౌన్ లెవల్ ఫెడరేషన్లు (టీఎల్ఎఫ్) ద్వారా ఏర్పాటు చేస్తారు. ప్రతి జిల్లా ప్రధాన కార్యాలయంలో సంబంధిత జిల్లా మహిళా సమాఖ్య కనీసం ఒక పెట్రోల్ పంపు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఇటీవల అధికారులను ఆదేశించారు.అధికారుల ప్రకారం.. ఈ చొరవ మహిళా సమాఖ్యలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో జిల్లా స్థాయిలో పారదర్శకంగా, వృత్తిపరంగా ఇంధన రిటైల్ కార్యకలాపాలను చేయవచ్చు. పెట్రోల్ పంపుల ద్వారా ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది. అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాలలో దశలవారీగా అమలు ప్రారంభమవుతుందని అధికారులు చెబుతున్నారు.తెలంగాణ మున్సిపల్ ప్రాంతాలలో పేదరిక నిర్మూలన మిషన్ల ద్వారా పెట్రోల్ పంపులను స్థాపించడానికి సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసింది.సంబంధిత జిల్లా సమాఖ్య లేదా ఖాళీలు నిర్వహించే పెట్రోల్ పంపులను ఏర్పాటు చేయడానికి చర్యలు ప్రారంభించాలని అన్ని జిల్లా కలెక్టర్లను కూడా కోరింది. మార్గదర్శకాల ప్రకారం, సంబంధిత చమురు కంపెనీలతో సమన్వయంతో జిల్లా యంత్రాంగం ప్రధాన ప్రదేశాలలో తగిన భూమిని గుర్తిస్తుందని అధికారులు తెలిపారు.భూమి లీజుకు సంబంధించిన ప్రతిపాదనలను మెప్మాకి సమర్పించాలి. అయితే లీజు డాక్యుమెంటేషన్ – నిబంధనల ప్రకారం 20 లేదా 30 సంవత్సరాలకు చమురు కంపెనీలతో సంప్రదించి ప్రాసెస్ చేస్తారు. అవి రిజిస్ట్రేషన్ ఖర్చులను భరిస్తాయి.టీఎల్ఎఫ్, ఏఎల్ఎఫ్లు చమురు కంపెనీలతో చర్చల ఆధారంగా నిర్మాణ, సంసిద్ధత పనులను చేపడతాయి. జిల్లా కలెక్టర్ ఆమోదించిన తీర్మానాల ద్వారా టీఎల్ఎఫ్/ఏఎల్ఎఫ్ వర్కింగ్ క్యాపిటల్ను సమీకరిస్తాయి. సజావుగా పనిచేయడానికి మెప్మా, సంబంధిత సమాఖ్య మధ్య ఒక అవగాహన ఒప్పందంపై సంతకం జరుగుతుంది.చమురు కంపెనీలు డీలర్షిప్ లైసెన్స్లను జారీ చేసినప్పటికీ కార్యాచరణ నియంత్రణ టీఎల్ఎఫ్/ఏఎల్ఎఫ్ వద్దనే ఉంటుంది. మెప్మా సాంకేతిక, హ్యాండ్హోల్డింగ్ మద్దతును అందిస్తుందని, కార్యకలాపాలు ప్రారంభించే ముందు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ తప్పనిసరిగా పొందాలని అధికారులు చెబుతున్నారు.'సమాఖ్యలు ఉమ్మడి కరెంట్ బ్యాంక్ ఖాతాను తెరవాలి. పాన్, వ్యాట్ రిజిస్ట్రేషన్లు పొందాలి. యజమాని పేరు మెప్మా ఖాళీ ఫిల్లింగ్ స్టేషన్ లేదా మెప్మా–ఖాళీ ఫిల్లింగ్ స్టేషన్ అని జాబితా చేయాలి. ఇంధన పంపిణీ యూనిట్ల స్టాంపింగ్, ఇంధన అమ్మకాలను పర్యవేక్షించడానికి ఆటోమేషన్ వ్యవస్థల సంస్థాపన, డిజిటల్,
మాన్యువల్ రికార్డుల నిర్వహణ కోసం మార్గదర్శకాలు లీగల్ మెట్రాలజీ విభాగంతో సమన్వయాన్ని తప్పనిసరి చేస్తాయి.' అని అధికారులు పేర్కొన్నారు.మహిళలు నిర్వహించే పెట్రోల్ పంపుల మేనేజర్లు, ఇంధన సహాయకులను జిల్లా కలెక్టర్ల మార్గదర్శకత్వంలో టీఎల్ఎఫ్, ఏఎల్ఎఫ్ తీర్మానాల ద్వారా స్వయం సహాయక బృందాల నుండి ఎంపిక చేస్తారు. ముందస్తు అనుమతితో ఇంధన కమిషన్ ఛార్జీలను గౌరవ వేతనం, విద్యుత్ బిల్లులు, నిర్వహణ ఖర్చులను తీర్చడానికి ఉపయోగించవచ్చు. జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన జరిగే కార్యనిర్వాహక కమిటీలు నెలకు రెండుసార్లు కార్యకలాపాలను సమీక్షిస్తాయి. టీఎల్ఎఫ్/ఏఎల్ఎఫ్లకు వర్కింగ్ క్యాపిటల్ తిరిగి చెల్లించడంతో సహా నికర లాభాల వినియోగాన్ని నిర్ణయిస్తాయని తెలుస్తోంది.

# ధరణి... భూమాత...డొల్లేనా

**కరీంనగర్, మార్చి 5 పెన్ పవర్:**
తెలంగాణలో భూముల దందాడ సారీ, భూముల వ్యవహారం అద్భుతం! ప్రభుత్వం మారినా పోర్టల్ పేరు మారినా రైతుల కష్టాలు మాత్రం 'ఎటర్నల్' అన్నట్టు సాగుతున్నాయి. ధరణి పోయి భూ భారతి వచ్చింది.కానీ పాత సమస్యలే కొత్త వేషంలో మళ్ళీ దర్శనమిస్తున్నాయి. పేరు మారిస్తే జాతకం మారుతుందని నమ్మే మన పాలకులకు.. సాఫ్ట్వేర్ కూడా అంతే అనిపిస్తుందేమో!'ధరణి'లో వంద రకాల సమస్యలు ఉంటే, వాటినిపరిష్కరిస్తామని వచ్చిన 'భూ భారతి'లో కొత్తగా లొసుగులు బయటపడుతున్నాయి. అంటే పాత సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్తవి బోనస్గా వస్తున్నాయన్నమాట. ఇదో రకమైన 'డబుల్ బొనాంజా'రైతులకు!ధరణి ఉన్నప్పుడు స్లాట్ రద్దు చేసుకుంటే కట్టిన డబ్బులు తిరిగి రావడానికి అంతులేని జాప్యం జరిగేది. ఇప్పుడు భూ భారతి వచ్చాక కూడా అదే పరిస్థితి. ప్రభుత్వం దగ్గర డబ్బులు తీసుకోవడం తెలుసు..కానీ తిరిగి ఇవ్వడం కొంచెం 'కష్టం' కదా మరి!ఇక అతిపెద్ద కామెడీ ఏంటంటేడ మీ సేవ ఏజెంట్లు రిజిస్ట్రేషన్ ఛార్జీలను జేబులో వేసుకుంటుంటే సర్కార్ దాన్ని అడ్డుకోలేకపోతోంది. తహశీల్దార్లకు ఆ ఛార్జీలను చూసేఅవకాశం లేకపోవడంతో ఏజెంట్లు కోట్లు వెనకేసుకుంటున్నారు. ప్రభుత్వానికి మాత్రం చుక్కెదురు.




వరంగల్ పోలీసులే రంగంలోకి దిగి అరెస్టులు చేసే వరకు ఈ వ్యవహారం సర్కారుకు తెలియకపోవడం, వారి

**'పనితీరుకు' అద్దం పడుతోంది.**

ఈ సమస్యలన్నీ పరిష్కారం కావడానికి, భూ భారతి పోర్టల్ పక్కాగా మారడానికి మరో ఆరు నెలలు పడుతుందని అధికార వర్గాలే చెబుతున్నాయి. అంటే అప్పటివరకు రైతుల తిప్పలు యథాతథమే! పేరు మార్చి ప్రజలను బురిడీ కొట్టించడం కాకుండా సమస్యల మూలాలను ద
పట్టుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారుధరణిలో సమస్యలు ఉంటే భూ భారతి తెచ్చారు, మరి భూ భారతిలో సమస్యలుఉంటే ఏం తెస్తారు? 'భూ నరకం'? ఏది ఏమైనా తెలంగాణలో భూమి కొన్నా, అమ్మినా.. అది ఒక పెద్ద 'సాహస యాత్రే'!

## విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి..



**మంచిర్యాల, మార్చి 5 పెన్ పవర్:** ద్వారక ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సబ్ ఇన్స్పెక్టర్ వంగ విష్ణువర్ధన్ భవిష్యత్తు, ఆశయాలపై గురువారం అవగాహన కల్పించారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిత అని, అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి చేరి ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని, రాబోయే పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం 33 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. పాఠశాల సిబ్బంది ఎస్సైని సన్మానించారు.

## లక్షేటీపేటలో అక్రమ వెంచర్లపై మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు

**బెల్లంపల్లి, మార్చి 5 పెన్ పవర్:** లక్షేటీపేట మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ వెంచర్లు వేస్తున్నారని, ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మాజీ కౌన్సిలర్ లావుడ్యా సురేష్ నాయక్ గురువారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. డీటీసీపీ లేఅవుట్ అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తున్నారని, టౌన్ ప్లానింగ్ అధికారి విధి నిర్వహణ సరిగా లేదని, గాంధీ చౌక్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేనియెడల ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

**చెన్నూరు, మార్చి 5 పెన్ పవర్:** కన్నేపల్లి మండలం జనకాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, గ్రామంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా పనులు చేపట్టినట్లు సర్పంచ్ పేర్కొన్నారు.

## కుల పెద్దల మాట వినలేదని ఏడేళ్లుగా బహిష్కరణ

**ఆసిఫాబాద్, మార్చి 5 పెన్ పవర్:** వాంకిడి మండలంలో కుల పెద్దల మాట వినలేదని ఒక కుటుంబాన్ని ఏడేళ్లుగా కుల బహిష్కరణ చేసి వేధిస్తున్నారని బాధితులు వాంకిడి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. 2016లో పెంచి కాల్ పేట్ మండలానికి చెందిన పెండెష్ తో వాంకిడికి చెందిన లావణ్య వివాహం చేసుకున్నారు. లావణ్య తల్లిదండ్రులు అల్లుడిని ఇల్లరికం తీసుకొచ్చి, వాంకిడిలో బార్బర్ షాపు పెట్టించారు. అయితే, తమ అనుమతి లేకుండా షాపు పెట్టారని, నాలుగు కుర్చీలకు బదులు రెండు కుర్చీలే పెట్టాలని కుల పెద్దలు అభ్యంతరం తెలిపారు. వారి మాట వినకపోవడంతో, ఏడేళ్లుగా ఆ కుటుంబాన్ని శుభకార్యాలకు పిలవకుండా, తమ ఇంటికి రానివ్వకుండా వేధిస్తున్నారని బాధితులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సమాచార హక్కు రక్షణ చట్టం జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్ నియామకం

**సిర్పూర్, మార్చి 5 పెన్ పవర్:** సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కాగజ్‌నగర్ మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన వంగరి ప్రవీణ్ గురువారం నియమితులయ్యారు. కాగజ్‌నగర్‌లో జరిగిన జిల్లా సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కొండగుర్ల కమలాకర్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. సమాచార హక్కు చట్టం బలోపేతానికి కృషి చేయడమే కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సమాజ అభివృద్ధికి సేవలందిస్తున్నందున ప్రవీణ్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర నాయకత్వం పేర్కొంది. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి, నియామక ప్రక్రియలో సహకరించిన రాష్ట్ర నియామకాల ఇంచార్జీ సుధాకర్, అలాగే ఆసిఫాబాద్ జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రి చేతుల మీదుగా షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



**జగిత్యాల, మార్చి 5 పెన్ పవర్:** ధర్మారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ 38 మంది లబ్ధిదారులకు 38 లక్షల 4 వేల 408 రూపాయల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ఆడపిల్లలకు కల్యాణ లక్ష్మి పథకం ఒక వరమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుమలత, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కర కమిటీలో మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు స్థానం

**కోరుట్ల, మార్చి 5 పెన్ పవర్** 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం గోదావరి పుష్కర కమిటీని నియమించింది. ఈ కమిటీ అధ్యక్షుడిగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును, సభ్యుడిగా ధర్మపురి ఎమ్మెల్యే మంత్రి లక్ష్మణ్ కుమార్ ను గురువారం నియమించారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన ధర్మపురి గోదావరి నది అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి లక్ష్మణ్ కుమార్ ను నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మపురి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్డీవో సరితను సన్మానించినకౌన్సిలర్ ఎస్పీ శివ

**షాద్‌నగర్, మార్చి 5( పెన్ పవర్** గురువారం షాద్ నగర్ ఆర్డీవో సరితను స్థానిక పట్టణ కౌన్సిలర్ ఎస్పీ శివ మర్యాదపూర్వకంగా తన కార్యాలయంలో కలిశారు. కౌన్సిలర్ గా ఎన్నికైన తర్వాత ఆమెను సన్మానించి, 26వ వార్డులో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై చర్చించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం తరఫున ఇళ్లను అందజేయాలని ఆర్డీవో సరితను ఎస్పీ శివ కోరారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రాజ్యసభ ఎంపికలతో కాంగ్రెస్‌లో అసంతృప్తి స్వరం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలలో రాజ్యసభ ఎన్నికల సమయంలో ప్రతిసారీ కనిపించే అంతర్గత అసంతృప్తి ఈసారి కూడా కాంగ్రెస్ పార్టీలో స్పష్టంగా బయటపడింది. రాష్ట్రంలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల కోసం ఆశించిన సీనియర్ నాయకులకు అవకాశం దక్కకపోవడంతో పార్టీలో చర్చలు, విమర్శలు మొదలయ్యాయి. ముఖ్యంగా చాలా సంవత్సరాలుగా పార్టీకి సేవలందించిన సీనియర్ నేతలు వీ. హన్మంతరావు, మధు యాష్కీ గౌడ్, టి. జీవన్‌రెడ్డి, నేరెళ్ల శారద వంటి నాయకులు ఆశలు పెట్టుకున్నప్పటికీ, చివరకు పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం వారికి ఆశాభంగాన్ని కలిగించింది. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలపై మళ్లీ దృష్టిని ఆకర్షించింది.

తెలంగాణలో ప్రస్తుతం ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియలో అనేక ఊహాగానాలు వినిపించాయి. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఎన్నో దశాబ్దాలుగా పనిచేసిన నాయకులు ఈసారి తమకు అవకాశం దక్కుతుందనే ఆశతో ఎదురుచూశారు. ముఖ్యంగా వీ. హన్మంతరావు వంటి నాయకుడు కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆయన పార్టీ తరఫున ఎన్నో ఉద్యమాలలో పాల్గొనడమే కాకుండా, బలమైన సామాజిక వర్గానికి ప్రతినిధిగా నిలిచారు. ఇదే విధంగా మాజీ పార్లమెంట్ సభ్యుడు మధు యాష్కీ గౌడ్ కూడా కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించిన నాయకుడు. అలాగే టి. జీవన్‌రెడ్డి అనేక దశాబ్దాలుగా కాంగ్రెస్ రాజకీయాలలో కొనసాగుతున్న అనుభవజ్ఞుడైన నాయకుడు. మహిళా నాయకురాలిగా నేరెళ్ల శారద కూడా పార్టీ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించారు. ఈ నేపథ్యంతో వీరిలో ఎవరికైనా అవకాశం దక్కుతుందని రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలు భావించాయి. అయితే చివరకు కాంగ్రెస్ అధిష్టానం తీసుకున్న నిర్ణయం పూర్తిగా భిన్నంగా మారింది. రాష్ట్రంతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా దేశవ్యాప్తంగా ప్రముఖ న్యాయవాదిగా గుర్తింపు పొందిన అభిషేక్ మను సింఘ్వీకి ఒక రాజ్యసభ సీటును కేటాయించగా, మరో సీటుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా భావించబడుతున్న వేం నరేందర్‌రెడ్డికి అవకాశం ఇవ్వడం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సమీకరణాలపై ప్రశ్నలు లేవనెత్తింది. అభిషేక్ మను సింఘ్వీ దేశ రాజకీయాలలో ప్రముఖ న్యాయవాది, రాజ్యాంగ నిపుణుడిగా పేరుపొందారు. సుప్రీంకోర్టులో సీనియర్ అడ్వకేట్‌గా పనిచేస్తూ అనేక ముఖ్యమైన రాజ్యాంగ సంబంధిత కేసుల్లో వాదనలు వినిపించారు. కాంగ్రెస్ పార్టీలో కూడా ఆయనకు కీలక స్థానం ఉంది. గతంలో రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. పార్టీ తరఫున జాతీయ స్థాయిలో న్యాయపరమైన పోరాటాలలో కీలక పాత్ర పోషించినందున ఆయనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం భావించినట్లు తెలుస్తోంది. అయితే తెలంగాణలో స్థానిక నాయకులకు అవకాశం ఇవ్వకుండా రాష్ట్రానికి వెలుపల వ్యక్తికి సీటు ఇవ్వడంపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక మరో రాజ్యసభ సీటుకు వేం నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేయడం కూడా రాజకీయంగా ఆసక్తికర పరిణామంగా మారింది. వేం నరేందర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా గుర్తింపు పొందిన నాయకుడు. పార్టీ కార్యక్రమాలలో ఆయన చురుకైన పాత్ర పోషించినప్పటికీ, అనేక మంది సీనియర్ నాయకులు ఉండగా ఆయనకు అవకాశం ఇవ్వడాన్ని కొందరు కాంగ్రెస్ వర్గాలు ఆశ్చర్యంగా చూస్తున్నాయి. ముఖ్యంగా దీర్ఘకాలంగా పార్టీకి సేవలందించిన నాయకులు ఈసారి తమకు అవకాశం దక్కుతుందని భావించినప్పటికీ, చివరకు రాజకీయ సమీకరణాలు వేరే దిశగా మారాయి. కాంగ్రెస్ పార్టీలో ఈ తరహా పరిస్థితులు కొత్తవి కావు. జాతీయ పార్టీగా కాంగ్రెస్ వివిధ రాష్ట్రాలలో రాజ్యసభ స్థానాలను రాజకీయ సమీకరణాల ప్రకారం వినియోగించడం గతంలో కూడా జరిగింది. కొన్నిసార్లు జాతీయ స్థాయిలో పార్టీకి అవసరమైన నిపుణులు, న్యాయవాదులు, ఆర్థికవేత్తలు లేదా వ్యూహకర్తలకు రాజ్యసభ ద్వారా పార్లమెంటులో ప్రవేశం కల్పించడం కాంగ్రెస్ మాత్రమే కాకుండా ఇతర జాతీయ పార్టీల్లో కూడా కనిపించే సంప్రదాయం. అయితే అదే సమయంలో రాష్ట్ర స్థాయిలో పార్టీకి సంవత్సరాలుగా సేవలందించిన నాయకులకు అవకాశం ఇవ్వకపోతే అసంతృప్తి రావడం సహజమే. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడుతున్నాయి. అధికారంలోకి వచ్చిన తరువాత పదవుల పంపకంలో సహజంగానే ఆశావహుల సంఖ్య పెరుగుతుంది. ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ పదవులు, కార్పొరేషన్లు, అలాగే రాజ్యసభ వంటి పదవుల కోసం నాయకులు ఎదురుచూస్తుంటారు. ఈ నేపథ్యంలో అందరికీ ఒకేసారి అవకాశాలు ఇవ్వడం సాధ్యం కాదు. అందువల్లే కొన్నిసార్లు నిర్ణయాలు అసంతృప్తిని కలిగిస్తాయి. సీనియర్ నాయకులకు అవకాశం రాకపోవడం కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారి తీసింది. ముఖ్యంగా వీ. హన్మంతరావు వంటి నాయకుడు అనేక దశాబ్దాలుగా కాంగ్రెస్ రాజకీయాలలో కీలక పాత్ర పోషించినప్పటికీ, ఆయనకు మరోసారి అవకాశం దక్కకపోవడం కొందరు నాయకులు ప్రస్తావిస్తున్నారు. అలాగే మధు యాష్కీ గౌడ్ కూడా పార్లమెంట్‌లో కాంగ్రెస్ తరఫున చురుకైన పాత్ర పోషించిన నాయకుడు. టి. జీవన్‌రెడ్డి వంటి నాయకుడు కూడా రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి. మహిళా నాయకురాలిగా నేరెళ్ల శారద కూడా పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో వీరిలో ఎవరికైనా అవకాశం ఇచ్చి ఉంటే పార్టీకి అంతర్గతంగా మంచి సందేశం వెళ్లేదని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే మరోవైపు కాంగ్రెస్ నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించే వాదనలు కూడా ఉన్నాయి. జాతీయ స్థాయిలో న్యాయపరమైన పోరాటాలు పెరుగుతున్న నేపథ్యంలో రాజ్యసభలో బలమైన న్యాయవాది అవసరం ఉందని, ఆ దృష్టితోనే అభిషేక్ మను సింఘ్వీకి అవకాశం ఇచ్చారని కొందరు పార్టీ నాయకులు చెబుతున్నారు. అదే విధంగా రాష్ట్ర రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని వేం నరేందర్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాజ్యసభ ఎన్నికలు సాధారణంగా శాసనసభలో సంఖ్యాబలం ఆధారంగా జరుగుతాయి. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి తగిన సంఖ్యాబలం ఉండడంతో ఈ రెండు స్థానాలను గెలుచుకోవడం పెద్ద కష్టం కాదు. అందువల్ల అభ్యర్థుల ఎంపిక పూర్తిగా పార్టీ అంతర్గత నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో అధిష్టానం, రాష్ట్ర నాయకత్వం కలిసి తీసుకున్న నిర్ణయం ప్రకారం అభ్యర్థుల ఎంపిక జరిగినట్లు తెలుస్తోంది. ఇలాంటి నిర్ణయాలు కొన్నిసార్లు తాత్కాలిక అసంతృప్తిని కలిగించినప్పటికీ, దీర్ఘకాలంలో పార్టీ ఐక్యతను కాపాడుకోవడం నాయకత్వానికి పెద్ద సవాలుగా ఉంటుంది. ముఖ్యంగా అధికారంలో ఉన్న సమయంలో పార్టీ అంతర్గత అసంతృప్తి బయటకు రావడం ప్రతిపక్షాలకు ఆయుధంగా మారే అవకాశం ఉంటుంది. అందువల్ల కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నాయకులతో చర్చలు జరిపి వారికి తగిన గౌరవం కల్పించే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం రాజకీయంగా కీలక దశ కొనసాగుతోంది. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం, ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడం, అలాగే పార్టీ అంతర్గత ఐక్యతను కాపాడుకోవడం వంటి అంశాలు పార్టీ నాయకత్వానికి ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభ స్థానాల ఎంపికపై వచ్చిన చర్చలు పార్టీ అంతర్గత రాజకీయాల స్వభావాన్ని ప్రతిబింబిస్తున్నాయి. మొత్తానికి తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల ఎంపిక కాంగ్రెస్ పార్టీలో రాజకీయ చర్చకు దారి తీసింది. సీనియర్ నాయకులకు అవకాశం రాకపోవడం ఒకవైపు అసంతృప్తిని కలిగించినప్పటికీ, పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి రాజకీయ వ్యూహాత్మక కారణాలు కూడా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తులో పార్టీ ఈ అసంతృప్తిని ఎలా నిర్వహిస్తుంది, సీనియర్ నాయకులకు ఎలాంటి అవకాశాలు కల్పిస్తుంది అన్నది తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలలో కీలక అంశంగా మారే అవకాశం ఉంది.

# ఎర్ర జెండా నీడలో అవిశ్రాంత పోరాటం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ రాజకీయ చరిత్రలో సాయుధ ఉద్యమం ఒక విభిన్న అధ్యాయంగా నిలిచింది. ఆ అధ్యాయానికి ప్రతీకగా మారిన పేరు ముప్పాళ లక్ష్మణ్ రావు, "గణపతి"గా ప్రసిద్ధి పొందిన వ్యక్తి. ఇటీవల వెలువడుతున్న లొంగుబాటు వార్తల నేపథ్యంలో ఆయన జీవితం, ఉద్యమ ప్రయాణం, దేశ రాజకీయ?సామాజిక పరిణామాలపై వాటి ప్రభావం మళ్లీ చర్చకు వచ్చింది. ఒక వ్యక్తి నిర్ణయం వెనుక దాగి ఉన్న దశాబ్దాల చరిత్రను, పూర్వాపరాలను, గణాంకాలను సమగ్రంగా పరిశీలించడం అవసరం. 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరి గ్రామంలో రైతుల తిరుగుబాటు భారత రాజకీయ దిశను ప్రభావితం చేసింది. భూస్వామ్య వ్యతిరేక పోరాటంగా ప్రారంభమైన ఆ ఉద్యమం "నక్సల్బరి" పేరుతో దేశవ్యాప్తంగా విస్తరించింది. విద్యార్థి యువత, సామాజిక అసమానతలపై ఆవేదన కలిగిన వర్గాలు ఈ సిద్ధాంతానికి ఆకర్షితులయ్యాయి. గ్రామీణ భారతంలో భూమి పంపిణీ, కూలీల హక్కులు, గిరిజనుల జీవనాధారాల పరిరక్షణ వంటి అంశాలు ఆ ఉద్యమానికి మూల సూత్రాలుగా నిలిచాయి. ఆ ప్రభావంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుత జగిత్యాల జిల్లా లోని మండల కేంద్రం అయిన బీర్ పూర్ గ్రామానికి చెందిన ముప్పాళ లక్ష్మణ్ రావు యువకుడిగా వామపక్ష భావజాలం వైపు మళ్లాడు. 1970లలో ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించిన సాయుధ గుంపుల్లో చేరి, తరువాత పీపుల్స్ వార్ గ్రూప్ లో ప్రముఖ పాత్ర పోషించాడు. కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలో ఏర్పడిన ఈ సంస్థ తెలంగాణ?ఆంధ్ర అటవీ ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధ వ్యూహాలతో కార్యకలాపాలు సాగించింది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ నిర్మాణం, గిరిజన యువతను ఆకర్షించడం, భూస్వామ్య వ్యతిరేక ప్రచారం వంటి కార్యక్రమాల్లో గణపతి సక్రియంగా పాల్గొన్నాడు.

2004లో పీపుల్స్ వార్ గ్రూప్ మరియు మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ విలీనమై కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) గా మారడం ఎడమచేయి అతివాద చరిత్రలో కీలక మలుపు. ఈ విలీనంతో దేశవ్యాప్తంగా ఉన్న విభిన్న గుంపులు ఒకే కేంద్రీయ నాయకత్వం కిందకి వచ్చాయి. ఆ సమయంలో గణపతి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి ఉద్యమానికి వ్యూహాత్మక దిశనిచ్చాడు. దండకారణ్య అటవీ ప్రాంతం కార్యకలాపాల కేంద్రంగా మారింది. 2004–2014 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. అధికార గణాంకాల ప్రకారం ఈ దశాబ్దంలో సుమారు 14,800కు పైగా హింసాత్మక ఘటనలు నమోదయ్యాయి; 6,000కు పైగా ప్రాణనష్టం సంభవించింది. భద్రతా దళాలు, మావోయిస్టులు, సాధారణ పౌరులు మూడు వర్గాలూ ఈ ఘర్షణల్లో బలయ్యారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో దాడులు తీవ్రరూపం దాల్చాయి. 2009లో కేంద్ర ప్రభుత్వం "ఆపరేషన్ గ్రీన్ హంట్" పేరుతో విస్తృత భద్రతా చర్యలు ప్రారంభించింది. అటవీ ప్రాంతాల్లో సైనిక శక్తిని పెంచడం, ప్రత్యేక బలగాలను నియమించడం, ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంది. ఈ చర్యల ఫలితంగా 2014 తరువాత హింసాత్మక ఘటనలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. 2014– 2024 మధ్యకాలంలో ఘటనలు సుమారు 7,100కు తగ్గి, మరణాల సంఖ్య 1,800కు చేరినట్లు కేంద్ర సమాచారం సూచిస్తుంది. ఒకప్పుడు 126 జిల్లాలను ప్రభావితం చేసిన ఎడమచేయి అతివాదం ప్రస్తుతం సుమారు 10–12 జిల్లాలకు మాత్రమే పరిమితమైందని అధికార నివేదికలు చెబుతున్నాయి. 2024లో సుమారు 475 మంది మావోయిస్టులు లొంగిపోగా, 2025లో ఈ సంఖ్య వెయ్యి దాటిందని భద్రతా వర్గాలు ప్రకటించాయి. ఇదే కాలంలో భద్రతా దళాల చర్యల్లో వందలాది మావోయిస్టు కాడర్లు మరణించినట్లు కూడా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామాల్లో గణపతి వ్యక్తిగత పరిస్థితులు కూడా కీలకమయ్యాయి. ఆరోగ్య సమస్యలు, వయోభారం కారణంగా 2018 ప్రాంతంలో ఆయన ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి తప్పుకోవడం జరిగింది. నాయకత్వ మార్పులు, అంతర్గత విభేదాలు, సాంకేతిక నిఘా వ్యవస్థల పెరుగుదల ఇవి ఉద్యమ సామర్థ్యాన్ని దెబ్బతీశాయి. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యా సదుపాయాలు, మొబైల్ కనెక్టివిటీ విస్తరించడం వల్ల భూగర్భ కార్యకలాపాలు కష్టతర మయ్యాయి. ఇటీవల వెలువడుతున్న లొంగుబాటు వార్తలు ఈ క్రమంలో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గణపతి స్వచ్ఛందంగా లొంగుతారా లేక ఇప్పటికే గోప్యంగా చర్చలు జరిగాయా అన్నది స్పష్టత పొందాల్సి ఉంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం ఒక దశాబ్దాలపాటు అత్యంత వాంఛనీయుడిగా ప్రకటించ బడిన నాయకుడు లొంగితే, అది ఉద్యమ చరిత్రలో సంకేతాత్మక మలుపు అవుతుంది. ఇది కేవలం ఒక వ్యక్తి మార్పు కాదు; ఒక సిద్ధాంత సాయుధ ప్రయాణానికి సంబంధించిన చారిత్రక దశ. అయితే దీనిని పూర్తిస్థాయి ముగింపుగా చూడటం సరికాదు. ఎందుకంటే సామాజిక అసమానతలు, భూహక్కుల సమస్యలు, గిరిజనుల జీవనోపాధి సంక్షోభం వంటి మూల కారణాలు ఇంకా పూర్తిగా పరిష్కరించ బడలేదు. కేవలం భద్రతా చర్యలతో ఉద్యమం తగ్గినా, శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర అభివృద్ధి విధానాలు, పారదర్శక పాలన, స్థానిక ప్రజల భాగస్వామ్యం అవసరం. గణపతి జీవితం విరుద్ధాల సమాహారం. ఒకవైపు సిద్ధాంతవేత్తగా రచనలు చేసిన వ్యక్తి; మరోవైపు హింసాత్మక పోరాటాలకు నాయకత్వం వహించిన వ్యక్తి. ఒకవైపు గిరిజన హక్కుల పరిరక్షణ నినాదాలు; మరోవైపు నిరపరాధుల ప్రాణనష్టం. ఈ విరుద్ధాలను అర్థం చేసుకోకుండా ఆయన ఉద్యమ రీతిని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. లొంగుబాటు జరిగితే చట్టపరమైన ప్రక్రియలు, విచారణలు, బాధితులకు న్యాయం వంటి అంశాలు ముందుకు వస్తాయి. అదే సమయంలో ఆయన అనుభవాలు ఉద్యమ అంతర్గత గమనాన్ని వెలుగులోకి తెచ్చే అవకాశమూ ఉంటుంది. చరిత్రలో అనేక సాయుధ ఉద్యమాలు కాలక్రమేణా రాజకీయ ప్రధాన ప్రవాహంలో కలిసి పోయాయి. కొన్ని క్షీణించాయి. గణపతి పరిణామం కూడా ఆ దిశగా ఒక సూచన కావచ్చు. మొత్తంగా చూస్తే, ముప్పాళ లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి ప్రయాణం భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఒక సవాలు, ఒక పాఠం. సాయుధ మార్గం, ప్రజాస్వామ్య మార్గం మధ్య ఉన్న విభేదం, అభివృద్ధి భద్రతా సమతుల్యత, సామాజిక న్యాయం సాధన? ఇవి గణపతి ప్రయాణంలో అంతర్లీనంగా ఉన్నాయి. లొంగుబాటు సందర్భం దేశానికి ఒక ఆత్మపరిశీలన క్షణం.

# ఆల్ ఈజ్ వెల్ కోసం తాపత్రయం

**గుంటూరు, మార్చి 5 పెన్ పవర్ :**
ఒకటే ఎజెండా. ఒకటే లైన్. నో క్లాషెన్. కమ్యూనికేషన్ గ్యాప్స్‌కు ఛాన్సే లేదు. డెసిషన్ ఏదైనా..మ్యాటర్ మరేదైనా కలిసే నిర్ణయం తీసుకుంటాం. కలిసిగట్టుగానే ముందుకెళ్తామంటున్నారు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. కూటమి భాగస్వామ్య పార్టీల రథసారధులుగా కీలకంగా ఉన్న ఇద్దరు టాప్ లీడర్లు..వరుస పెట్టి..నెలలో ఒకటి రెండుసార్లు భేటీ అవుతుండటం సమ్‌థింగ్ స్పెషల్‌గా మారింది. ఆ ఇద్దరు వన్ టు వన్ భేటీ అయ్యారు. కూటమిలో రెండు కీలక పార్టీల అధ్యక్షులు. పైగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశంపై ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో ఇంట్రెస్టింగ్ చర్చ జరుగుతోంది. వరుస పెట్టి భేటీల వెనుక మ్యాటరేంటన్నది ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఈ మధ్య రెగ్యులర్‌గా భేటీ అవుతూ పొలిటికల్ హాట్ టాపిక్ అవుతున్నారు. అటు అసెంబ్లీ సమావేశాల్లో కలుసుకుంటున్నారు. మంత్రివర్గ సమావేశాల్లోనే పక్కపక్కనే కూర్చుంటారు. అయినా ఆ ఇద్దరు ప్రత్యేకంగా భేటీ అవుతుండటం కూటమి నేతల్లో, జనాల్లో తెలియని క్యూరియాసిటీని పెంచేస్తోంది.బాబు, పవన్ ఇద్దరూ రోజంతా అసెంబ్లీలో కనిపిస్తున్నారు. అటు మంత్రివర్గ భేటీలో కూడా కలిసే ఉంటారు. నెక్స్ట్ డే స్పెషల్‌గా వన్ టు వన్ భేటీ అవుతున్నారు. అలా వన్ టు వన్ భేటీ జరిగిందంటే ఏదో కీలక అంశాలపై డిస్కస్ చేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఈ మధ్యలో జరిగిన రాజకీయ పరిణామాల మీదనే ఈ ఇద్దరు చర్చించి ఉంటారని అంటున్నారు.ఈ మధ్యే బాబు, పవన్ భేటీ జరిగింది. కల్తీ నెయ్యి ఇష్యూతో పాటు..పలు అంశాలపై డిస్కస్ చేశారు. ఆ తర్వాత కూటమి పార్టీల కంబైన్డ్ ప్రెస్‌మీట్ పెట్టి సంకేతాలు ఇవ్వగలిగారు. నెల రోజుల వ్యవధిలోనే మరోసారి బాబు, పవన్ సమావేశం జరిగింది. అది కూడా ఓవైపు అసెంబ్లీ సమావేశాలు నడుస్తుండగా బాబు, పవన్ సమావేశానికి ముందు ఏదో ఒక ఇష్యూ జరుగుతూనే ఉంది. ఆ టాపిక్ మీదే వారి భేటీలో డిస్కషన్ జరిగినట్లు ప్రచారం నడుస్తోంది.ఈ మధ్య ఒంగోలు కూటమి రాజకీయం హాట్ టాపిక్‌గా మారింది. టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, జనసేన నేత, మాజీమంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి మధ్య కోల్డ్‌వార్ మరోసారి రచ్చకెక్కింది. సవాళ్లు, ప్రతి సవాళ్లతో తగ్గేదేలే అంటున్నారు ఆ ఇద్దరు లీడర్లు. సేమ్‌టైమ్ అక్కడక్కడ జనసేన, టీడీపీ యాక్టివిస్టుల మధ్య ఇన్‌సైడ్ వార్ కొనసాగుతోంది. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ మధ్య మంచి అండర్ స్టాండింగ్ ఉన్నా..గ్రౌండ్ లెవెల్‌లో ఎక్కడో ఓ చోట క్లాషెస్ రచ్చకెక్కుతుండటం కూటమికి హెడెక్‌గా మారాయి. ఈ ఇంటర్నల్ వార్‌కు ఎప్పటికప్పుడు చెక్ పెట్టేందుకు ప్రయత్నించే క్రమంలోనే చంద్రబాబు, పవన్ భేటీలో కీలక డెసిషన్ తీసుకున్నట్లు చెప్పుకుంటున్నారు.కూటమిలో రెండు పార్టీల క్యాడర్ నుంచి మొదలెట్టి లీడర్ల దాకా అంతా కలసికట్టుగా ఉండాలని టీడీపీ, జనసేన చీఫ్‌లు ఎప్పటికప్పుడు కోరుతూనే ఉన్నారు. ఏ ఇబ్బందులు, సమస్యలు ఉన్నా కూర్చుని సర్దుబాటు చేసుకోవాలని చెబుతున్నారు. అలకలు, అసంతృప్తులు సహజం..వాటిని పెద్దవి చేయకుండా సాఫీగా పరిష్కారం చేసుకోవాలని కూడా సజెస్ట్ చేస్తున్నారు. అయినా కొంత గ్యాప్ అయితే అక్కడక్కడ కొనసాగుతోంది. వాటికి ఎలా చెక్ పెట్టాలనేది టాప్ ప్రయారిటీగా తీసుకోవాలని అనుకుంటున్నారు.ఇప్పటికే అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిపోవడం..కూటమి పార్టీల మధ్య క్లాషెస్ వైసీపీకి అడ్వాంటేజ్‌గా మారే ప్రమాదం ఉండటంతో వీలైనంత త్వరగా అంతా సెట్‌రైట్ చేయాలని భావిస్తున్నారట. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో జరిగిన భేటీ ఏకంగా రెండు గంటలకు పైగా సాగింది. పాలనాపరమైన అంశాల నుంచి రాజకీయ అంశాల దాకా చర్చకు వచ్చాయని చెబుతున్నారు. ఏపీలో విపక్ష వైసీపీ వ్యవహార శైలి, మండలిలో ఛైర్మన్ తీరు..రాజ్యసభ సీట్లపై కూడా చర్చ జరిగిందని అంటున్నారు.ఏపీలో ఇంకా కొన్ని కీలక నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. తొందరలోనే నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతున్నాయి. వీటిపై కూడా డిస్కస్ చేసినట్లు తెలుస్తోంది. టీడీపీకి రెండు, బీజేపీ, జనసేనకు చెరో రాజ్యసభ సీటు అన్నది ఐదారు నెలలుగా ప్రచారం జరుగుతోంది. ఈ సీట్ల కోసం ఎంతో మంది ఆశావహులు ఉన్నారు. అయితే ఎవరిని నామినేట్ చేయాలన్నది చర్చించి ఉండే అవకాశం ఉంది. ఇక అసెంబ్లీ సెషన్ ఈ నెల 7వ తేదీతో ముగియనుంది. దాంతో ఈ సమావేశాలు ముగిసేలోపు చేపట్టాల్సిన

వ్యూహంపై చర్చించారని అంటున్నారుఅయితే లేటెస్ట్‌గా వైసీపీ కాస్త దూకుడు పెంచినట్లు కనిపిస్తోంది. కల్తీ నెయ్యి ఇష్యూలో సిట్ రిపోర్ట్ తర్వాత చాలా మంది లీడర్లు లైమ్ లైట్‌లోకి రావడం..కూటమిపై డైరెక్ట్ అటాక్ చేస్తుండటంతో..మరింత పటిష్టమైన వ్యూహంతో ముందుకెళ్లే ఆలోచన చేస్తోందట కూటమి. ప్రతీ అంశాన్ని రాజకీయంగా పీక్స్‌కు తీసుకెళ్తున్న ఫ్యాన్ పార్టీని ధీటుగా ఎదుర్కోవాలన్నదే చంద్రబాబు, పవన్ డెసిషన్ అంటున్నారు. అయితే చంద్రబాబు, పవన్ ఇద్దరు కీలక శాఖలు చూస్తున్నారు. అవన్నీ నిధులు ఉంటేనే పనిచేయగలిగే శాఖలుఅలాంటి ఇంటర్నల్ అంశాలే కీలకమైనా..ప్రతీసారి ఈ ఇద్దరి భేటీతో అయితే ఇటు కూటమి పార్టీల క్యాడర్‌కు, అటు ప్రజలకు పాజిటివ్ ఇండికేషన్స్ వెళు తున్నాయని చెబుతున్నారు. వారి భేటీ కంటే ముందు జరుగుతున్న రాజకీయ రచ్చ, ప్రజా సమస్యలపై సీఎం, డిప్యూటీ సీఎం భేటీలో ఓ కన్‌క్లూజన్‌కు వస్తున్నారని అంటున్నారు. సేమ్‌టైమ్ కూటమి బలంగా పటిష్టంగా ఉందని మిత్రుల మధ్య సయోధ్య ఉందన్న సందేశం వెళ్తుందని చర్చించుకుంటున్నారు.

# టిష్యూ ట్రాన్స్ ప్లాంటేషన్లలో ఏపీ టాప్

**విజయవాడ మార్చి 5, పెన్ పవర్ :**
అవయవాల దానశీలో భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆరో స్థానంలో నిలిచిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ రాష్ట్రాల వారీగా అవయవ దానశీ జాబితా–2025ను ప్రకటించింది. రాష్ట్ర విభజన తరువాత 2015లో ఏర్పాటు అయిన జీవన్ దాన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తుందన్నారు.ఇటీవల హైకోర్టు ప్రభుత్వాసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సల గురించి ఆదేశాలు వెలువరించిన నేపథ్యంలో మంత్రి సత్య కుమార్ వైద్య ఆరోగ్య, జీవన్ దాన్ ట్రస్ట్ అధికారులతో సమీక్ష జరిపారు. అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగే ఆసుపత్రుల సంఖ్య మూడు నుంచి తొమ్మిదికి పెరిగిందన్నారు ఈ జాబితాలో వైజాగ్ కేజీహెచ్, విమ్స్, గుంటూరు జీజీహెచ్, కర్నూలు జీజీహెచ్, తిరుపతి స్విమ్స్, మంగళగిరి ఎయిమ్స్, పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్–తిరుపతి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పలాస, జీజీహెచ్ విజయవాడ ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు.అలాగే కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, ఒంగోలు, అనంతపురం, వైయస్సార్ కడప, తిరుపతి ఆసుపత్రుల్లో బ్రెయిన్ డెడ్ కేసుల నుంచి అవయవాల తొలగింపు, ఇతర ఆసుపత్రులకు తరలించేందుకు అవసరమైన అనుమతులు ఇచ్చామని జీవన ట్రస్ట్ కోఆర్డినేటర్ రాంబాబు.. మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు పెరిగేలా చూడాలని, పురోగతి కనిపించాలని అధికారులను ఆదేశించారు.విశాఖలోని కేజీహెచ్, విమ్స్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, కర్నూలు ప్రభుత్వాసుపత్రి ద్వారా ఇప్పటి వరకు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు నుంచి ఎనిమిది కిడ్నీలు, ఒక లివర్ మార్పిడి చేయగా రక్తసంబంధీకుల నుంచి 87 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు




చేసినట్లు అధికారులు వివరించారు. తాజాగా విజయవాడ శివారులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండెను స్వీకరించి గుండె మార్పిడి విజయవంతంగా పూర్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది రెండు నెలల కాలంలో 18 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 64 అవయవాలు స్వీకరించి 64 మంది జీవితాల్లో వెలుగులు నింపారు. ఇది గడిచిన రెండు సంవత్సరాలతో పోల్చుకుంటే గణనీయంగా అవయవ దాన కేసులు పెరుగుతున్నాయి అనటానికి నిదర్శనం అన్నారు మంత్రి సత్యకుమార్. గత ఏడాది మొదటి రెండు నెలల్లో 12 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 31 అవయవ దాన మార్పిడి జరిగితే, 2024 లో 10 మంది బ్రెయిన్ డెడ్ వ్యక్తులు నుంచి సహకరించిన 30 అవయవాల మార్పిడి జరిగాయన్నారు.1200 మంది బాధితులకు రాష్ట్ర జీవన్ దాన్ నూతన జీవితాలను ప్రసాదించిందని బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించి బాధితులకు అండగా నిలుస్తూ వారి జీవితాలకు కొత్త వెలుగులు నింపిందన్నారు మంత్రి. గత ఏడాది కాలంలోనే 301 మంది బాధితులకు నూతన జీవితాలను ప్రసాదించి సరికొత్త చరిత్రను రాష్ట్ర జీవన్ దాన్ సృష్టించింది అని పేర్కొన్నారు..రాష్ట్రంలో 20–50 ఏళ్ల వయసు మధ్యలో ఎక్కువ మంది అవయవాలు విఫలమై బాధపడుతున్నట్లు రాష్ట్ర జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా తెలిసిందన్నారు మంత్రి సత్యకుమార్. ట్రస్టులో ఇప్పటి వరకు 5347 మంది పలు అవయవాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారిలో అధికంగా యువకులే ఉండటం ఉన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 0–09 ఏళ్లలోపు పిల్లలు 38 మంది ఉన్నారని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించే విధంగా వాళ్లకి గౌరవం కల్పించేడానికి జారీ చేసిన జీవో 95 ద్వారా అవయవ దానం చేసిన వ్యక్తికి ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కరణలు జరుగుతున్నాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. అలాగే అవయవదాత కుటుంబానికి 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆర్థిక సాయం రూ.లక్ష వరకు పెంచే విషయశీ ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు.

# వైసీపీలో కొత్త నియామాకాలు



**కడప, మార్చి 5, పెన్ పవర్ :**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలపడేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. జగన్మోహన్ రెడ్డి సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. అన్ని సామాజిక వర్గాల నేతలు మొహరి స్తున్నారు. గత కొద్దిరోజులుగా కాపు సామాజిక వర్గం చుట్టూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు తిరుగుతున్నాయి. మరోవైపు ఎస్సీ సామాజిక వర్గం నేతలతో కూడా జగన్మోహన్ రెడ్డి గట్టిగానే మాట్లాడిస్తున్నారు. ఒకవైపు రాజకీయం చేస్తూనే మరోవైపు రాజకీయంగా బలపడాలని భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అందులో భాగంగా ప్రాంతాలవారీగా పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రతో పాటు గోదావరి జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. అందులో భాగంగా పార్టీలో సీనియర్లకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. తాజాగా రీజినల్ కోఆర్డినేటర్లను నియమించారు.
గతంలో ఉత్తరాంధ్రను ఒక రీజియన్ గా చూసి నియామకాలు చేపట్టేవారు. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాలకు కలిపి ఒక ప్రాంతీయ సమన్వయకర్తను నియమించిన సందర్భాలు ఉన్నాయి. గతంలో ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి, వై వి సుబ్బారెడ్డి లాంటివారు వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి ఉత్తరాంధ్రను విడగొట్టారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం ఒక రీజియన్ గా చూపి కోఆర్డినేటర్ గా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడును నియమించారు. మరోవైపు విశాఖ, విజయనగరం రీజియన్ కోఆర్డినేటర్ గా మాజీమంత్రి కురసాల కన్నబాబును, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను ఒక రీజియన్ గా చేసి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను, ఉమ్మడి పశ్చిమగోదావరి రీజియన్కు మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ ను సమన్వయకర్తగా నియమించారు జగన్మోహన్ రెడ్డి. తద్వారా కీలక నేతలందరికీ బాధ్యతలు అప్పగించినట్టు అవుతుంది.గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు రీజియన్లను విభజించి కోఆర్డినేటర్లను నియమించేవారు. ఈ నేపథ్యంలో రకరకాల సమస్యలు వచ్చేవి. ఈసారి అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ.. అందరి నేతలకు బాధ్యతలు అప్పగించాలన్న ఆలోచన లోకి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో కూడా కోఆర్డినేటర్లను నియమిస్తారని తెలుస్తోంది. త్వరలో జగన్మోహన్ రెడ్డి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. అంతకంటే ముందే రీజనల్ కోఆర్డినేటర్ల నియామకం పూర్తి చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన అదే పని మీద ఉన్నారు. మరోవైపు రాష్ట్ర కోఆర్డినేటర్ గా ప్రస్తుతం సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారు. ఆయన స్థానంలో సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు నియమిస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే మున్ముందు పార్టీ నియామకాల విషయంలో జగన్మోహన్ రెడ్డి కఠిన నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తారని ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## ప్రకాశంలో ఫ్యాన్ కు రెక్కలు కరువు

**ఒంగోలు, మార్చి5 పెన్ పవర్ :** ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒకప్పుడు వైసీపీ కి బలమైన కోటగా గుర్తింపు పొందింది. వరుస ఎన్నికల్లో పార్టీకి గట్టి మద్దతు ఇచ్చిన ఈ జిల్లా 2024 ఎన్నికలలో మాత్రం భిన్నమైన తీర్పు ఇచ్చింది. దీనికి ప్రతిపక్ష ప్రభావం కంటే, పార్టీ అంతర్గత సమస్యలే ప్రధాన కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ రాయలసీమ లో హార్డ్ కోర్ ప్రాంతంగా చెప్పుకునే ప్రకాశం జిల్లా ఇప్పుడు వైసీపీకి ఆత్మపరిశీలన అవసరాన్ని గుర్తు చేస్తోంది.2014 ఎన్నికలలో టీడీపీ , బీజేపీ జనసేన కూటమి బలంగా ఉన్నప్పటికీ, వైసీపీ ఐదు అసెంబ్లీ స్థానాలు గెలుచుకుని తన స్థిరతను చాటుకుంది. 2019లో పరిస్థితి మరింత అనుకూలంగా మారి ఎనిమిది స్థానాలు దక్కించుకుంది. అయితే 2024లో పార్టీ కేవలం రెండు సీట్లకే పరిమితమైంది. అంతేకాకుండా ఒంగోలు లోక్‌సభ స్థానాన్ని కూడా కోల్పోయింది. ఈ పరిణామం జిల్లా రాజకీయాల్లో పెద్ద మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు.జిల్లాలో బలమైన నాయకత్వం తగ్గిపోవడం కూడా పార్టీకి ప్రతికూలంగా మారిందని అంటున్నారు. ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి టీడీపీలో చేరి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అలాగే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ( జనసేనలోకి మారడం పార్టీకి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఎన్నికల ముందు పలువురు నేతలు పార్టీని వీడడం వల్ల కేడర్‌లో గందరగోళం ఏర్పడింది.ప్రస్తుతం జిల్లాలో టీడీపీజనసేన కూటమి బలంగా ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పది అసెంబ్లీ స్థానాలు ,ఒక ఎంపీ సీటుతో కూటమి ఆధిపత్యం చూపుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీకి పునర్వ్యవస్థీకరణ అత్యవసరంగా మారింది. ఓటమి తర్వాత జిల్లా బాధ్యతలను దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కి అప్పగించినప్పటికీ, పార్టీని మళ్లీ ఉత్సాహపరిచే స్థాయిలో చైతన్యం రాలేదని కేడర్ అభిప్రాయపడుతోంది.ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌అప్పుడప్పుడు మీడియా సమావేశాలు నిర్వహించినా, కేడర్‌తో ప్రత్యక్ష సంబంధం పెంచే చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. జిల్లాలో సీనియర్ నాయకుడిగా ఉన్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కూడా చురుకుదనం చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా పార్టీ కార్యకర్తలు నాయకత్వంపై స్పష్టమైన దిశానిర్దేశం కోరుతున్నారు.ఓటమి జరిగి ఇరవై నెలలు గడుస్తున్నప్పటికీ, జిల్లా స్థాయిలో నిరాశ వాతావరణం కొనసాగుతోందని చెబుతున్నారు. పార్టీని మళ్లీ బలోపేతం చేయాలంటే సమన్వయం, చురుకైన నాయకత్వం , కేడర్‌కు ధైర్యం చెప్పే కార్యక్రమాలు అవసరమని భావిస్తున్నారు. అధినాయకత్వం ప్రకాశం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టకపోతే భవిష్యత్తులో మరింత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు సూచిస్తున్నాయి.

## రంగుల మిరపతో పాటు.. మహేంద్ర...
## వైరల్ గా మారిన లోకేష్ ట్వీట్

**గుంటూరు మార్చి5, పెన్ పవర్ :** గుంటూరు మిర్చి సాగు అద్భుత దృశ్యాలపై ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా , ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ మధ్య సోషల్ మీడియా వేదికగా జరిగిన ఆసక్తికర చర్చ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. గుంటూరు జిల్లాలో మిరపకాయలను ఆరబోసిన దృశ్యాలను డ్రోన్ ద్వారా చిత్రీకరించిన వీడియోను ఆనంద్ మహీంద్రా షేర్ చేశారు. పైనుంచి చూస్తుంటే ఎర్రటి తివాచీ పరిచినట్లున్న ఈ దృశ్యం ప్రకృతి సిద్ధమైన హోలీ రంగుల పండుగను తలపిస్తోందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అద్భుతమైన దృశ్యాన్ని కేవలం వ్యవసాయానికే పరిమితం చేయకుండా, ఏపీ ప్రభుత్వం దీనిని ఒక పర్యాటక ఆకర్షణగా మార్చాలని ఆనంద్ మహీంద్రా సూచించారు. శీతాకాలంలో జరిగే ఈ పంట కోత సమయాన్ని పర్యాటక సీజన్‌గా మార్చవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. నేల మీద నుంచి చూస్తే ఈ అందం కనిపించకపోవచ్చని, అందుకే పర్యాటకుల కోసం హాట్ ఎయిర్ బెలూన్ రైడ్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని, అలాగే స్థానిక సంగీత, నృత్య ప్రదర్శనలతో ఒక ఫెస్టివల్‌లా దీనిని నిర్వహించవచ్చని అద్భుతమైన ఐడియాలను ఇచ్చారు.ఆనంద్ మహీంద్రా సూచనలపై మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందిస్తూ సానుకూలంగా సమాధానమిచ్చారు. గుంటూరు మిర్చి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, వేల మంది రైతుల కష్టానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ రంగుల దృశ్యాన్ని పర్యాటక పరంగా ఎలా అభివృద్ధి చేయవచ్చో పరిశీలించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు లోకేష్ విజ్ఞప్తి చేశారు. మహీంద్రా ఇచ్చిన సలహాలు స్థానిక రైతుల ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో మంత్రి లోకేష్ చమత్కారంగా మరో ప్రతిపాదన కూడా చేశారు. భవిష్యత్తులో ఏపీపై డ్రోన్ విజువల్స్ తీసినప్పుడు కేవలం వ్యవసాయ క్షేత్రాలే కాకుండా.. రాష్ట్రంలో రాబోయే మహీంద్రా ఆటో ఫ్యాక్టరీ, డిఫెన్స్ ఎస్టాబ్లిష్‌మెంట్స్, ఏరోస్పేస్ పార్కులు కూడా ఆ డ్రోన్ కెమెరాల్లో కనిపించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పారిశ్రామికంగా కూడా ఆంధ్రప్రదేశ్ ఎలా అభివృద్ధి చెందుతోందో ప్రపంచానికి చూపించాలనే తన ఆకాంక్షను ఆయన వెల్లడించారు. ఆనంద్ మహీంద్రాను స్వయంగా ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానిస్తూ లోకేష్ ట్వీట్ చేశారు. ఏపీలో ఉన్న పారిశ్రామిక మరియు పర్యాటక అవకాశాలను దగ్గరుండి చూపిస్తామని లోకేష్ పేర్కొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.నారా లోకేష్ ఈ వీడియో పోస్ట్ చేసిన తర్వాత దీనిపై దేశీయ కార్పొరేట్ దిగ్గజం ఆనంద్ మహీంద్రా స్పందించారు. వీడియో అద్భుతంగా ఉందని.. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉందని ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు. దీనిపై కందుల దుర్గేష్ తో మాట్లాడుతామని.. పర్యటకంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని నారా లోకేష్ పేర్కొన్నారు. అయితే ఇక్కడే నారా లోకేష్ తన లౌక్యాన్ని ప్రదర్శించారు. భవిష్యత్తు కాలంలో ఏపీలో మహీంద్రా ఆటో ఫ్యాక్టరీ, డిఫెన్స్ పార్కులను కూడా ఇలాంటి డ్రోన్ కెమెరాల ద్వారా రూపొందించిన వీడియోలో చూడాలని ఉందని లోకేష్ పేర్కొన్నారు. లోకేష్ అకస్మాత్తుగా తనలో ఉన్న ఈ మాటను బయట పెట్టడంతో ఆనంద్ మహీంద్రా కూడా సానుకూలంగా స్పందించారు.భవిష్యత్ కాలంలో ఏపీలో మహీంద్రా కంపెనీ ఆటో ఫ్యాక్టరీ, డిఫెన్స్ పార్కులను ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. వీటి ద్వారా వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సమాచారం. మహేంద్ర కంపెనీ ఇప్పటికే విశాఖపట్నంలో ఐటీ కార్యకలాపాలు సాగిస్తోంది. సత్యం కంపెనీని టేకోవర్ చేసుకున్న తర్వాత మహీంద్రా ఐటీ కార్యకలాపాలను వేగవంతం చేసింది. హైదరాబాదులో టెక్ మహీంద్రా పేరుతో అతిపెద్ద ఐటీ కంపెనీని నిర్వహిస్తోంది. ఒక పారిశ్రామిక దిగ్గజం ఇచ్చిన ఐడియాకు, ఒక యువ మంత్రి స్పందించిన తీరు సోషల్ మీడియాలో నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.

## ఏపీ బియ్యం తెలంగాణకు..



**ఏలూరు, మార్చి 4, పెన్ పవర్ :** ఏపీలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. నిత్యం ఏదో ఒక చోట రేషన్ బియ్యం పట్టుపడుతూనే ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో విధాలుగా కట్టడి చేసే ప్రయత్నం చేసింది. కానీ అడ్డుకట్ట పడడమే లేదు. ముఖ్యంగా కాకినాడ పోర్టు ద్వారా పెద్ద ఎత్తున రేషన్ బియ్యం తరలిపోతుందన్న ఆరోపణలు నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అందుకు తగ్గట్టుగానే భారీ షిప్ పై తరలిపోతున్న రేషన్ బియ్యం పట్టుబడింది. అప్పటినుంచి కాకినాడ పోర్ట్ పై ప్రత్యేక నిఘా ఉంది. అయితే ఆ పోర్టుపై రేషన్ బియ్యం తరలింపు ఆగిన రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో రేషన్ బియ్యం రవాణా కొనసాగుతూనే ఉంది.రేషన్ బియ్యం విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగుతూ వచ్చింది. తనిఖీలను ముమ్మరం చేసింది. అయినా సరే కట్టడి జరగడం లేదు. కొంతమంది మిల్లర్లు, వ్యాపారులు కుమ్మక్కై ఈ దందాకు పాల్పడుతున్నారని స్పష్టమవుతోంది. గ్రామాల్లో కమిషన్ ఏజెంట్లను నియమించుకొని.. ప్రజలు రేషన్ బియ్యం విడిపించిన వెంటనే ఆ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. అదే బియ్యాన్ని కమీషన్ ప్రాతిపదికన మిల్లర్లకు విక్రయిస్తున్నారు. అదే బియ్యం రీ పాలిష్ చేసి లెవీకి పంపుతున్నారు. అదే బియ్యాన్ని మళ్లీ రేషన్ బియ్యం గా మార్చేస్తున్నారు. ఈ దందా కొనసాగుతూనే ఉంది. అయితే తెలంగాణ బియ్యం ఏపీకి.. ఏపీ బియ్యం తెలంగాణకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా తెలంగాణ నుంచి ఏపీకి తరలిస్తున్న బియ్యం నల్గొండ జిల్లాలో పట్టుబడింది.ఇప్పటివరకు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు అక్రమార్కులు. కానీ ఇప్పుడు తెలంగాణ నుంచి ఏపీకి బియ్యం తీసుకొచ్చి చలామణి చేస్తున్నారు. సన్న బియ్యం పేరిట విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వినియోగదారులు రేషన్ విడిపించిన వెంటనే వారి నుంచి 15 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసినందుకు గాను మధ్య వ్యక్తులకు మిల్లర్లు, వ్యాపారులు కిలో దగ్గర నాలుగు రూపాయలు అందిస్తున్నారు. అదే బియ్యాన్ని ఏపీలో 25 రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అంటే కిలో దగ్గర పది రూపాయలు దోపిడీ కొనసాగుతోందన్నమాట. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడడంతో అసలు విషయం బయటకు వచ్చింది. గత కొద్దిరోజులుగా ఈ దందా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఎక్కడికక్కడే తనిఖీల ద్వారా ఈ రేషన్ బియ్యం రవాణా కు చెక్ పెట్టేందుకు రెండు రాష్ట్రాల అధికారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. విస్తృత తనిఖీలు జరుపుతున్నట్లు సమాచారం. మొత్తానికి అయితే బియ్యం రవాణా కట్టడికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగడం విశేషం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలోకి ప్రవేశించే తర్వాతి దేశం పాకిస్థానే కావచ్చు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధంతో పశ్చిమాసియాలో పరిస్థితి అత్యంత భయానకంగా ఉంది. అమెరికా స్థావరాలు, దాని మిత్రదేశాలను ఇరాన్ టార్గెట్ చేసింది. దీంతో ఎక్కడికక్కడ విమానాలు నిలిచిపోయి, చమురు సరఫరా ఆగిపోయింది. గత ఐదు రోజులుగా ఎటుచూసినా బాంబుల మోత, యుద్ధ సైరన్ల శబ్దాలే వినిపిస్తున్నాయి. రోజు రోజుకూ యుద్ధం తీవ్రతరం అవుతుండటంతో ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇక, సౌదీ అరేబియాలో ఒక చిన్న ఇరానియన్ ఆత్మాహుతి డ్రోన్ చేసిన పని వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకిస్థాన్‌ను ఈ యుద్ధం వైపు ఆకర్షిస్తుంది. దీనికి సౌదీతో కుదిరిన వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందమే కారణం. సెప్టెంబరు 2025లో సౌదీ అరేబియా, పాకిస్థాన్ మధ్య ఈ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం.. ఈ రెండు దేశాల్లో దేనిపైనైనా దాడి జరిగినా ఇద్దరిపై దాడి జరిగినట్టు పరిగణించాలి. అయితే, అందులో అణ్వాయుధాలు ఉన్నాయా లేదా అనే దానిపై స్పష్టమైన వివరణ లేదు. ఈ విషయంలో పాకిస్థాన్ ఆలోచన ఏంటి అనేది ఆ దేశ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్.. సౌదీపై దాడిచెయొద్దని ఇరాన్‌కు పంపిన సందేశాన్ని బట్టి అర్థమవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మా రెండు దేశాల మధ్య రక్షణ ఒప్పందం ఉందని వాళ్లకు స్పష్టంగా చెప్పానని దార్ అన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా సంయుక్త దాడుల తర్వాత పాక్ ఉద్దేశాన్ని బయపెట్టిన తొలి ప్రకటన ఇదే. అయితే, గతవారం నుంచి అఫ్గనిస్థాన్‌లోని తాలిబన్లు పాక్‌పై దాడులు చేస్తున్నా.. సౌదీ అరేబియా కూడా స్పందించలేదు. దీంతో ఇది కాగితాలకే పరిమితమా? అనే వాదన వినిపిస్తోంది. వ్యూహాత్మక సైనిక రక్షణ ఒప్పందంలో అత్యంత వివాదాస్పదమైన అంశం పాక్ తన అణు సామర్థ్యాలను సౌదీకి విస్తరించేందుకు వీలు కల్పించిందేమోనన్న అనుమానాలను రేకెత్తిస్తోంది. దోహా, ఖతార్‌పై గతేడాది సెప్టెంబరులో ఇజ్రాయెల్ వైమానిక దాడుల తర్వాత గల్ఫ్ భద్రతను కాపాడటంలో అమెరికా సామర్థ్యంపై సందేహాలు తలెత్తాయి. దీంతో సౌదీ కొత్త భాగస్వాముల కోసం అన్వేషణ ప్రారంభించిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇరాన్‌పై దాడుల వేళ.. మిత్రదేశం చైనా మౌనం ఎందుకు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌పై అమెరికా జరుపుతున్న దాడుల వెనుక కేవలం రాజకీయ కారణాలే ఉన్నాయని అనుకుంటే పొరపాటే. దీని వెనుక ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే ఒక భారీ ఆర్థిక కుట్ర ఉందని కూడా నిపుణులు విశ్లేషిస్తున్నారు. చైనాలోని ఒక చిన్న వాణిజ్య బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ కున్లున్ కేంద్రంగా సాగుతున్న ఈ రహస్య లావాదేవీలే ఇప్పుడు అగ్రరాజ్యానికి కంటగింపుగా మారాయి. మెగ్నమ్ ఫిన్వెస్ట్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు సౌరభ్ జైన్ వివరణ ప్రకారం.. చైనా చాలా తెలివిగా 'పేమెంట్ లూప్' అనే వ్యవస్థను సృష్టించింది. దీని ద్వారా డాలర్లతో అస్సలు పని లేకుండానే ఇరాన్ నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇరాన్ నుంచి నెలకు సుమారు 1.5 బిలియన్ డాలర్ల విలువైన చమురును చైనా కొనుగోలు చేస్తోంది. కానీ చెల్లింపులు మాత్రం యువాన్ కరెన్సీలో జరుగుతున్నాయి. అమెరికా ఆంక్షల నుంచి తప్పించుకోవడానికి ఇరాన్ చమురును మలేషియా చమురుగా తప్పుడు ధృవీకరణ పత్రాలతో మార్చి రవాణా చేస్తున్నారు. ఈ రహస్య వ్యవస్థలో 'బ్యాంక్ ఆఫ్ కున్లున్' కీలక పాత్ర పోషిస్తోంది. ఇరాన్ తన చమురును చైనాకు అమ్ముతుంది. ఆ డబ్బు యువాన్ల రూపంలో కున్లున్ బ్యాంక్ ఖాతాల్లో పడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఇరాన్‌పై ఆంక్షలు ఉండటంతో.. ఆ డబ్బును ఇరాన్ వేరే దేశాల్లో ఖర్చు చేయలేదు. ఫలితంగా ఇరాన్ ఆ యువాన్లతో మళ్లీ చైనా నుంచే యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, ఇతర వస్తువులను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అంటే చైనా నుంచి వెళ్లిన డబ్బు మళ్లీ వస్తువుల రూపంలో చైనాకే చేరుతోంది. దీనివల్ల అమెరికా డాలర్ అవసరమే లేకుండా వ్యాపారం నిరాటంకంగా సాగిపోతోంది.

## ఇరాన్ 'ప్లాస్టిక్ డ్రోన్' ఎత్తులతో అమెరికా, ఇజ్రాయెల్ టెక్నాలజీలు చిత్తు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా-ఇజ్రాయెల్, దాని మిత్ర దేశాల్లోని స్థావరాలపై ఇరాన్ ప్రతీకార దాడులు యావత్తు ప్రపంచాన్ని విస్మయానికి గురిచేస్తున్నాయి. గతవారం టెహ్రాన్ సహా ఇరాన్ నగరాలపై అమెరికా-ఇజ్రయెల్ సంయుక్త దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో తమ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ మరణంతో రగిలిపోయిన ఇరాన్..పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు, దాని మిత్రదేశాల ఆర్థిక మూలాలపై విరుచుకుపడుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ అధునాతన సాంకేతికతలను, రక్షణ వ్యవస్థలను ఛేదించుకుంటూ సాగుతోంది. ప్రస్తుత ఘర్షణలో సంప్రదాయ యుద్ధ రీతుల స్థానంలో డ్రోన్లు కీలకంగా మారాయి. సాధారణంగా లోహాలతో తయారయ్యే క్షిపణులు, ఫైటర్ జెట్‌లను రాడార్లు సులువుగా గుర్తిస్తాయి. అయితే, ఇరాన్ యుద్ధ తంత్రం అమెరికా, ఇజ్రాయెల్‌కు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. 'ప్లాస్టిక్ - కార్బన్ ఫైబర్' వంటి పదార్థాలతో తయారు చేసిన కామికాజ్ డ్రోన్లు ఇరాన్ ప్రయోగిస్తోంది. రాడార్ సిగ్నల్స్ వీటిని గుర్తించలేకపోవడంతో అత్యాధునిక రక్షణ వ్యవస్థలు సైతం లక్ష్యానికి అతి సమీపంలోకి వచ్చే వరకు డ్రోన్ల ఉనికి పసిగట్టలేకపోతున్నాయి. దీంతోఇరాన్, దాని ప్రాక్సీలు ఈ డ్రోన్ల ద్వారా అమెరికా స్థావరాలు, దాని మిత్రదేశాలు, యుద్ధ నౌకలపై దాడిచేసి, తక్కువ ఖర్చుతో పెను విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. ఈ షాహెద్ సిరీస్ డ్రోన్లు పెద్ద పేలోడ్‌ను మోసుకెళ్లి, చాలా దూరం ప్రయాణించగలవు. చాలా ఖరీదైన లక్ష్యాలను ఛేదించగలవు. ఆధునిక క్రూయిజ్ క్షిపణి చేయగలిగే పనిని అవి తక్కువ ఖర్చుతో చేయగలవు.

## టారిఫ్‌ల సొమ్ము రిఫండ్ చేయాల్సిందే

**హైదరాబాద్ పెన్ పవర్:** టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగానికి మరో ఎదురుదెబ్బ తగిలింది. టారిఫ్‌ల సొమ్ము రిఫండ్ చేయాల్సిందేనని న్యూయార్క్‌లోని ట్రేడ్ కోర్టు తీర్పునిచ్చింది. 1977 అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద ట్రంప్ గతేడాది విధించిన భారీ సుంకాలను సుప్రీంకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అట్మస్ ఫిల్ట్రేషన్ అనే సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా.. దిగుమతిదారులు రిఫండ్ పొందేందుకు అర్హులని తాజాగా ట్రేడ్ కోర్టు న్యాయమూర్తి రిచర్డ్ ఈటన్ పేర్కొన్నారు. ఈ సుంకాల సొమ్ము వాపసుకు సంబంధించిన కేసులను తానే చూడనున్నట్లు వెల్లడించారు. ఇటీవల సుప్రీం తీర్పులో ట్రంప్ టారిఫ్‌లు చెల్లవని స్పష్టం చేసింది. కానీ, రిఫండ్‌ల గురించి ఎలాంటి ప్రస్తావన చేయలేదు. తాజా తీర్పుతో ఈ ప్రక్రియపై కొంత స్పష్టత వచ్చినట్లయ్యింది. ఈ తీర్పును అప్పీల్ చేస్తామని ట్రంప్ యంత్రాంగం తరఫు న్యాయవాది పేర్కొన్నారు. కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్స్ ద్వారా యూఎస్‌లోకి దిగుమతయ్యే అన్ని వస్తువులు 'లిక్విడేషన్' అనే ప్రక్రియలోకి వస్తాయి. ఈ వస్తువులపై అధికారులు విధించిన సుంకంపై అభ్యంతరం తెలపడానికి దిగుమతిదారులకు 180 రోజుల సమయం ఉంటుంది. ఆ గడువు ముగిసిపోతే.. వారు యూఎస్ అధికారులు విధించిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సుంకాలు వసూలుచేయడం ఆపాలని న్యాయమూర్తి కస్టమ్స్‌ను ఆదేశించారు. ఇప్పటికే లిక్విడేషన్ ప్రక్రియ పూర్తయి ఉంటే.. సుంకాలు లేకుండా వస్తువులను తిరిగి లెక్కించాలని స్పష్టం చేశారు. ఇదిలాఉండగా.. ప్రపంచ దేశాలపై ట్రంప్ విధిస్తానన్న 15శాతం సుంకాలు ఈ వారంలో అమల్లోకి రావొచ్చని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు.

# నితీష్ నిర్ణయంపై జేడీయూ నేతల ఆందోళన



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా ఏప్రిల్ నెలలో పలు రాజ్యసభ సభ్యుల పదవి కాలం ముగియనుంది. ఈ క్రమంలో అన్ని పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించి నామినేషన్ దాఖలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించారు. దీంతో సీఎం నితీష్ కుమార్ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, పాట్నాలోని ఆయన నివాసం వద్ద జేడీయూ (ఏఆజ) నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగానే కొనసాగాలని, ఆయన నాయకత్వం బీహార్ అభివృద్ధికి ఎంతో అవసరమని వారు నినాదాలు చేశారు. తన పార్లమెంటరీ కోరికను నెరవేర్చుకోవాలనే నితీష్ ప్రకటనపై పార్టీ శ్రేణులు తీవ్ర భావోద్వేగానికి లోనవుతున్నారు. ఇందులో భాగంగా ఈ రోజు ఉదయం నితీష్ నివాసం వద్దకు పెద్ద ఎత్తున్న చేరుకున్న కార్యకర్తలు.. నిరసనకు దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు భారీగా మోహరించారు. కార్యకర్తలు తమ ప్రియతమ నేతను కలిసి రాజ్యసభ నామినేషన్ వేయవద్దని విజ్ఞప్తి చేసేందుకు ప్రయత్నించారు. "నితీష్ కుమార్ బీహార్ ముఖచిత్రం, ఆయన లేని బీహార్‌ను ఊహించలేము" అని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నితీష్ కుమార్ తన నిర్ణయం పై పునరాలోచన చేస్తారా అనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# దుబాయ్‌లో చిక్కుకున్న వారిని ఆదుకుంటాం



**హైదరాబాద్ పెన్ పవర్:** తాను రీల్ హీరో మాత్రమే కాదు రియల్ హీరో అని మరోసారి నిరూపించుకున్నాడు నటుడు సోనూసూద్. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల కారణంగా విమాన సర్వీసులు రద్దు కావడంతో వందలాది మంది దుబాయ్‌లో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. కాగా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చిక్కుకున్న ప్రయాణికుల పట్ల రియల్ హీరో సోనూసూద్ తన ఉదారతను చాటుకున్నారు. విదేశీ గడ్డపై దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, అక్కడ ఇబ్బంది పడుతున్న వారందరికీ ఉచితంగా వసతి కల్పించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సహాయం అందించడానికి ఆయన ఎటువంటి షరతులు విధించకపోవడం గమనార్హం. కేవలం భారతీయులకే కాకుండా, ఏ దేశానికి చెందిన ప్రయాణికులైనా సరే, ఆపదలో ఉన్నప్పుడు మానవత్వమే ముఖ్యమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సోనూసూద్ తెలిపారు. కరోనా కష్టకాలంలో లక్షలాది మంది వలస కార్మికులను క్షేమంగా వారి ఇళ్లకు చేర్చి 'ప్రజా మనిషి'గా గుర్తింపు పొందిన సోనూసూద్... ఇప్పుడు విదేశాల్లో చిక్కుకున్న వారి కోసం రంగంలోకి దిగడం విశేషం. దుబాయ్‌లో ఉండి సరైన వసతి దొరకక ఇబ్బందులు పడుతున్న వారు నేరుగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో మెసేజ్ చేయాలని ఆయన సూచించారు. అలా మెసేజ్ చేసిన వెంటనే తన టీమ్ బాధితులను సంప్రదించి, వారికి అవసరమైన వసతి ఏర్పాట్లు చేస్తుందని భరోసా ఇచ్చారు. యుద్ధం కారణంగా విమాన ప్రయాణాలు నిలిచిపోయి ఆందోళనలో ఉన్న వేల మందికి సోనూసూద్ చేసిన ఈ ప్రకటన ఒక పెద్ద ఊరటనిస్తోంది. సోషల్ మీడియా వేదికగా ఆయన చేస్తున్న ఈ నిరంతర సేవపై నెటిజన్ల నుంచి భారీ ఎత్తున ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# డీఎంకే, ఏఐఏడీఎంకేలపై టీవీకే చీఫ్ విజయ్ నిప్పులు!



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడు రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేయాలని భావిస్తున్న నటుడు, తమిళగ వెట్రి కళగ అధ్యక్షుడు విజయ్ చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారాయి. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి బలమైన ప్రాంతీయ పార్టీలు తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవడానికి ఏకమయ్యాయని విజయ్ తీవ్ర ఆరోపణలు చేసారు. విజయ్ వ్యాఖ్యలు రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమీకరణాలను మార్చనున్నాయి. తమిళనాడు రాజకీయ ముఖచిత్రంలో కొత్త ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న తమ పార్టీని అణచివేయడానికి సంప్రదాయ రాజకీయ శక్తులు ఏకమయ్యాయని టీవీకే అధినేత విజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తంజావూరులో జరిగిన భారీ బహిరంగ సభలో తన మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించిన విజయ్.. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న డీఎంకే, ప్రధాన ప్రతిపక్షం ఏఐఏడీఎంకే తన రాజకీయ ప్రస్థానాన్ని అడ్డుకునేందుకు లోపాయికారీ ఒప్పందాలతో కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో మార్పు కోరుకుంటున్న కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా టీవీకే ఎదుగుతోందనే భయం ఈ పార్టీలలో మొదలైందని, అందుకే తనపై వ్యక్తిగత విమర్శలు, రాజకీయ దాడులకు దిగుతున్నారని విజయ్ మండిపడ్డారు. ప్రజలే తన బలమని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా రాజీలేని పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ఆరోపణలకే పరిమితం కాకుండా ఈ సభలో రైతులు, సామాన్య వర్గాలను ఆకట్టుకునేలా విజయ్ భారీ హామీలను ప్రకటించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే అన్నదాతల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## మిడిల్ ఈస్ట్ యుద్ధం.. దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూ

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంది. కాగా ఈ వార్ దాని ప్రభావం అంతర్జాతీయ చమురు సరఫరాపై పడుతుందనే వార్తలు సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారమవుతు న్నాయి. ముఖ్యంగా పెట్రోలు, డీజిల్ కొరత ఏర్పడుతుందనే భయంతో జనం పెట్రోల్ బంకులవైపు పరుగులు తీసేలా చేస్తోంది. నిన్న తెలంగాణలోని హైదరాబాద్ లో పెట్రోల్ బంకుల వద్ద జనం భారీగా క్యూ కట్టగా.. నేడు అదే సీన్ మహారాష్ట్రలోనూ రిపీట్ అయింది. గురువారం మహారాష్ట్రలోని పర్భణి, ఛత్రపతి సంభాజీ నగర్ వంటి నగరాల్లో వాహనదారులు పెట్రోలు బంకుల ప్రజలు భారీ క్యూలో నిలబడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా యి. భవిష్యత్తులో ఇంధన ధరలు భారీగా పెరగవచ్చని, లేదంటే సరఫరా పూర్తిగా నిలిచిపోవచ్చనే తప్పుడు ప్రచారా లను నమ్మి, ప్రజలు తమ వాహనాల్లో ఇంధనాన్ని నింపుకు నేందుకు పోటీ పడుతున్నారు. అయితే ఈ గందరగోళంపై పెట్రోలు డీలర్ల సంఘాలు మరియు ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించాయి. దేశంలో ప్రస్తుతం ఎటువంటి ఇంధన కొరత లేదని, సరఫరా వ్యవస్థ అత్యంత సాధారణంగా కొనసాగుతోందని వారు స్పష్టం చేశారు. కేవలం వదంతులను నమ్మి అనవసరంగా ఆందోళన చెందవద్దని, బంకుల వద్ద రద్దీ పెంచడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలుగుతాయని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నిరసనల వేళ కశ్మీర్‌లో కొనసాగుతున్న కఠిన ఆంక్షలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణంతో జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా బుధవారం కూడా అక్కడ కఠిన ఆంక్షలు కొనసాగాయి. శనివారం వరకు విద్యావ్యవస్థలను ప్రభుత్వం మూసివేసింది. మొబైల్ ఇంటర్నెట్ వేగంపైనా నియంత్రణ అమల్లో ఉంది. ప్రజలు గుమిగూడకుండా భద్రతా బలగాలు చర్యలు తీసుకుంటున్నాయి. షియా వర్గం ఎక్కువగా ఉన్నచోట్ల, అధిక సంఖ్యలో ప్రజలు నిరసనలు చేపట్టిన ప్రాంతాల్లో ఈ ఆంక్షలను కఠినంగా అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధవాతావరణాన్ని అనుకూలంగా మార్చుకొని పలువురు వ్యక్తులు, కొన్ని మీడియా సంస్థలు తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నట్లు

అధికారులు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేశారన్న ఆరోపణలతో శ్రీనగర్‌కు చెందిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఎంపీ అగా సయ్యద్ రుహుల్లా మెహదీ, శ్రీనగర్ మాజీ మేయర్ జునైద్ అజీమ్ మట్టులపై సైబర్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

## పాత్రికేయ దిగ్గజం హెచ్.కె.దువా కన్నుమూత

**హైదరాబాద్ పెన్ పవర్:** పాత్రికేయ దిగ్గజం, మాజీ రాయబారి, రాజ్యసభ మాజీ సభ్యుడు హెచ్.కె.దువా(88) కన్నుమూశారు. అనారోగ్యంతో దిల్లీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం దువా తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన 2009-2015 మధ్య రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. ది హిందుస్థాన్ టైమ్స్ ఎడిటర్‌గా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ట్రిబ్యూన్ పత్రికలకు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా, టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటోరియల్ అడ్వైజర్‌గా పని చేశారు. డెన్మార్క్‌లో 2001 నుంచి 2003 వరకూ భారత రాయబారిగా సేవలు అందించారు. 1937 జులై 1న జన్మించిన దువా మాజీ ప్రధానమంత్రులు వాజ్‌పేయీ, దేవెగౌడలకు

మీడియా సలహాదారుగా ఉన్నారు. పాత్రికేయ రంగానికి అందించిన సేవలకుగానూ పంజాబ్, కురుక్షేత్ర విశ్వవిద్యాలయాలు ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశాయి. పద్మభూషణ్, దుర్గా రతన్ పురస్కారాలతో పాటు బాల గంగాధర్ తిలక్ అవార్డును సొంతం చేసుకున్నారు.

## అమెజాన్‌లో మరోసారి లేఆఫ్‌లు.. రోబోటిక్స్ టీమ్‌పై వేటు




ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. ఈసారి రోబోటిక్స్ విభాగంలోని ఉద్యోగులపై వేటు పడింది. సుమారు 100 మంది వైట్‌కాలర్ ఉద్యోగులపై ప్రభావం పడినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ 'రాయిటర్స్' తన కథనంలో పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో 16 వేల మంది ఉద్యోగులను అమెజాన్ తొలగించింది. మరిన్ని తొలగింపులు ఉంటాయని అప్పట్లోనే సంకేతాలు ఇచ్చింది. అందులోభాగంగానే ఇప్పుడు తాజా లేఆఫ్‌లు చేపట్టింది. ఇందులోభాగంగా అమెజాన్ గోదాముల్లో పనిని ఆటోమేషన్ చేసేందుకు రోబోలను డిజైన్ చేసే టీమ్‌పై వేటు పడింది. కస్టమర్లకు మెరుగైన సేవలందించేందుకు తమ టీమ్‌ను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటామని అమెజాన్ ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే ఎంతమందిని తొలగించిందీ పేర్కొనకుండా లేఆఫ్‌లను ధ్రువీకరించింది. వేర్‌హౌస్‌లో కార్మికులకు సాయపడేందుకు రోబోటిక్ విభాగమైన బ్లూ జే.. గతేడాది అక్టోబర్‌లో రోబోలను ప్రదర్శించింది. అయితే, ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఈ ఏడాది జనవరిలో వీటి తయారీని నిలిపివేసింది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగుల కోతలను ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగ ప్రవేశం, ఖర్చుల తగ్గింపులో భాగంగా గతేడాది అక్టోబర్‌లో 14వేల మందిని, ఈ ఏడాది జనవరిలో 16 వేల మంది కలిపి ఇప్పటికే 30 వేల మంది ఉద్యోగులను అమెజాన్ పక్కనపెట్టింది.

## నెమ్మదించిన సేవల రంగ వృద్ధి

దేశీయ సేవల రంగ వృద్ధి ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వల్పంగా నెమ్మదించింది. కొత్త ఆర్డర్లలో పెరుగుదల 13 నెలల కనిష్ఠానికి పడిపోవడం ఇందుకు కారణం. ద్రవ్యోల్బణం పెరగడం, గిరాకీ ఓ మోస్తరుగానే పుంజుకోవడమూ ప్రభావం చూపిందని ఓ నెలవారీ సర్వే తెలిపింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ సూచీ ఫిబ్రవరిలో 58.1 పాయింట్లకు తగ్గింది. జనవరిలో ఇది 58.5 పాయింట్లుగా ఉంది. పీఎంఐ పరిభాషలో సూచీ 50 పాయింట్ల ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు; దిగువన ఉంటే క్షీణతగా పరిగణిస్తారు. ఫిబ్రవరిలో పీఎంఐ సూచీ 50 పాయింట్ల ఎగువన ఉన్నందున.. వృద్ధి ఉన్నప్పటికీ, జనవరితో పోలిస్తే స్వల్పంగా నెమ్మదించింది. పోటీ పెరగడంతో కొత్త ఆర్డర్ల రాక నెమ్మదించిందని హెచ్ఎస్‌బీసీ ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారి తెలిపారు. అంతర్జాతీయంగా విక్రయాలు పుంజుకోవడంతో, దానికి తగ్గట్లుగా నియామకాలను కంపెనీలు పెంచుకున్నాయని పేర్కొన్నారు. క్లయింట్ల ఎంక్వయిరీలు అధికంగా ఉండటం, మార్కెటింగ్ చర్యల వల్ల కొన్ని విభాగాల్లో విక్రయాలు పెరిగేందుకు తోడ్పడ్డాయని సర్వే వెల్లడించింది. పోటీ పరిస్థితులు పెరగడం వల్ల వృద్ధిపై ప్రభావం పడిందని కొన్ని కంపెనీలు తెలిపాయి. గత ఆగస్టు తర్వాత అంతర్జాతీయ విక్రయాల్లో వేగవంత వృద్ధి నమోదైనట్లు తెలిపింది. కంపెనీల నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరిగాయని, గత రెండున్నరేళ్లలోనే గరిష్ఠంగా నమోదయ్యాయని వివరించింది. దీంతో ఈ వ్యయాల భారంలో చాలా వరకు క్లయింట్లకే కంపెనీలు బదిలీ చేశాయని పేర్కొంది.

## ఫోన్‌పే విలువ రూ. 81,000-94,500 కోట్లు!




ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే, రాబోయే తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) కోసం సంస్థ విలువను 9-10 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.81,000-94,500 కోట్లు)గా పరిగణించాలని ఆశిస్తోంది. ఐపీఓ ద్వారా కంపెనీ 1.1 బిలియన్ డాలర్లు (రూ.10,000 కోట్లకు పైగా) సమీకరించాలని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 2023లో ఫోన్‌పే 12 బిలియన్ డాలర్ల విలువ వద్ద, 100 మిలియన్ డాలర్లు సమీకరించింది. దీంతో పోలిస్తే ప్రస్తుతం అంచనా వేస్తున్న సంస్థ విలువ తక్కువే. అయినా కూడా, పోటీ సంస్థ పేటీఎం తర్వాత రెండో అతిపెద్ద ఫిన్‌టెక్ పబ్లిక్ ఇష్యూగా ఫోన్‌పే నిలవనుంది. 2021లో 20 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.4 లక్షల కోట్లు) విలువతో పేటీఎం నమోదైంది. ఫోన్‌పే ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో రానుంది. ఫోన్‌పే ముసాయిదా పత్రాల ప్రకారం.. రూ.10,115 కోట్ల విలువైన షేర్లను వాల్‌మార్ట్, టైగర్ గ్లోబల్, మైక్రోసాఫ్ట్ గ్లోబల్ ఫైనాన్స్‌లు విక్రయించనున్నాయి.

## 'వార్' నష్టాలకు బ్రేక్.. లాభాల్లో సూచీలు



దేశీయ మార్కెట్ సూచీలు గురువారం లాభాల్లో ప్రారంభమయ్యాయి. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి భారీ నష్టాలను చవిచూసిన సూచీలు నేడు సానుకూలంగా కదలాడుతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు సెంటిమెంట్‌ను కాస్త బలపరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 500 పాయింట్ల వరకు పెరిగింది. ఉదయం 9.42 గంటల సమయంలో 273 పాయింట్ల లాభంతో 79,389 వద్ద ఉండగా.. నిఫ్టీ 90 పాయింట్లు పెరిగి 24,570 వద్ద ట్రేడవుతున్నాయి. నిఫ్టీ సూచీలో కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, రిలయన్స్, అదానీ పోర్ట్స్, లార్సెన్ షేర్లు రాణిస్తున్నాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్, ఏషియన్ పెయింట్స్, గ్రాసిమ్ స్టాక్స్ నష్టాల్లో ఉన్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 91.54గా ఉంది. అయితే, యుద్ధభయాల కారణంగా సూచీల్లో ఊగిసలాట కనిపిస్తోంది. బుధవారం అమెరికా మార్కెట్లు లాభాల్లో ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్లు కూడా అదే బాటలో ఉన్నాయి.

# సామాన్యుల కోసం పోస్టాఫీస్‌లో బెస్ట్ స్కీమ్




సామాన్య ప్రజలు తాము సంపాదించిన దాంట్లో కొంత పొదుపు చేయాలనుకుంటారు. అలాంటి వారందరికీ పోస్టాఫీసులో అద్భుతమైన పథకం ఉంది. అదే రికరింగ్ డిపాజిట్ స్కీమ్. ఎలాంటి రిస్క్ లేకుండా స్థిర ఆదాయ అందిస్తుంది. ప్రతి నెలా కొద్ది కొద్దిగా పొదుపు చేసుకుని 5 ఏళ్ల తరువాత పెద్ద మొత్తంలో డబ్బులు అందుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ హామీ ఉండడంతో ఇందులో ఎలాంటి రిస్క్ ఉండదు. క్రమం తప్పకుండా పొదుపు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చు. ప్రతి నెలా వేతనం పొందే వ్యక్తులు, గృహిణులు తమ పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేసే వారికి చాలా మంచి పథకం. మరి ఈ పథకానికి సంబంధించిన వివరాలు, వడ్డీ రేట్లు తెలుసుకుందాం. పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం ద్వారా ప్రస్తుతం వార్షిక వడ్డీ 6.7 శాతంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. త్రైమాసికానికి ఒకసారి చక్రవడ్డీ లెక్కిస్తారు. అంటే వడ్డీపైన వడ్డీ లభిస్తుంది. జనవరి నుంచి మార్చి 2026 వరకు ఇదే వడ్డీ రేటు లభిస్తుంది. నెలకు కనీసం రూ.100 పెట్టుబడితో రికరింగ్ డిపాజిట్ ఖాతా తెరవవచ్చు. ఆ తర్వాత రూ.10 గుణిజాలలో ఎంతైన జమ చేసుకోవచ్చు. ఈ పథకంలో ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. కాలపరిమితి 5 సంవత్సరాలుగా ఉంటుంది. 5 సంవత్సరాల మెచ్యూరిటీ టెన్యూర్ ఉంటుంది. క్రమం తప్పకుండా నెల నెలా పొదుపు చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని నెరవెర్చుకోవచ్చు. నెలకు రూ.11,111 జమ చేస్తూ వెళ్తే 5 ఏళ్లలో పెట్టుబడి మొత్తం రూ. 6,66,660 అవుతుంది. దీనిపై ఏడాదికి 6.7 శాతం వడ్డీ చొప్పున చూస్తే వడ్డీ రూపంలో రూ. 1,26,285 వస్తాయి. 5 సంవత్సరాలు పూర్తయితే మెచ్యూరిటీ నాటికి వడ్డీ, అసలు మొత్తం కలిపి రూ. 7,92,945 వస్తాయి. అంటే దాదాపు రూ.8 లక్షలు చేతికి అందుతాయి. ఈ రికరింగ్ డిపాజిట్ పథకంలో పెట్టుబడి పెట్టేవారికి వడ్డీ మాత్రమే కాకుండా మరికొన్ని అదనపు ప్రయోజనాలు ఉన్నాయి. ఏడాది పాటు వాయిదాలు చెల్లించిన తర్వాత మీ డిపాజిట్ నుంచి కొంత రుణంగా తీసుకోవచ్చు. అనుకోని ఖర్చులు ఎదురైనప్పుడు ఈ లోన్ సదుపాయం ఉపయోగపడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో డబ్బు అవసరమై అకౌంట్ క్లోజ్ చేసి అందులోని డబ్బులు మొత్తం తీసుకోవచ్చు. అయితే 3 ఏళ్లు పూర్తయిన తర్వాతే ఖాతా క్లోజ్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ పథకంలో చేరేందుకు సమీప పోస్టాఫీసుకి వెళ్లి వివరాలు, కావాల్సిన డాక్యుమెంట్లు అందించి కనీస పెట్టుబడి ఇస్తే ఖాతా ఓపెన్ చేస్తారు. అయితే, పోస్టాఫీసు పథకాల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ రేట్లను కేంద్ర ప్రభుత్వం సమీక్షిస్తుంది. కొన్నిసార్లు మార్చవచ్చు, కొన్నిసార్లు యథాతథంగా కొనసాగించే అవకాశం ఉంటుంది.

# ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ యూజర్లకు




ప్రముఖ టెలికాం కంపెనీ భారతీ ఎయిర్ టెల్ పోస్ట్ పెయిడ్ కస్టమర్లకు శుభవార్త చెప్పింది. ప్రస్తుతం అందిస్తున్న అన్‌లిమిటెడ్ 5జీతో పాటు 4జీ డేటా సర్వీసులను సైతం అన్‌లిమిటెడ్‌గా అందిస్తామని తెలిపింది. ఈ మేరకు వ్యక్తిగత, ఫ్యామిలీ పోస్ట్ పెయిడ్ ప్లాన్లను అప్‌డేట్ చేసినట్లు తెలిపింది. దీనిపై అధికారికంగా కంపెనీ ప్రకటన చేయనప్పటికీ వెబ్‌సైట్లో ఆ మేరకు మార్పులు చేసింది. మొదట 10 సర్కిళ్లలో ప్రయోగాత్మకంగా అన్‌లిమిటెడ్ సర్వీసులు ప్రారంభించిన ఎయిర్ టెల్ దేశవ్యాప్తంగా అన్ని సర్కిళ్లలో ఈ సేవలను తీసుకొచ్చినట్లు తెలిపింది. అన్‌లిమిటెడ్ అంటే 300 జీబీ వరకు హైస్పీడ్ డేటాను యూజర్లు పొందవచ్చని తెలిపింది.అప్‌డేట్ చేసిన ప్లాన్ల ప్రకారం నెలకు రూ.449 వ్యక్తిగత ప్లాన్ ద్వారా 1 సిమ్ (ప్రైమరీ), అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్, అన్‌లిమిటెడ్ 4జీ, 4జీ డేటా (300 జీబీ వరకు), ఎయిర్ టెల్ ఎక్స్ ట్రీమ్ ప్లై, జియో హాట్ స్టార్ (3 నెలలు) వంటివి వస్తాయి. ఇక రూ.549 ప్లాన్ ద్వారా 1 సిమ్, అన్‌లిమిటెడ్ కాల్స్ ప్లస్ ఎస్ఎంఎస్, డేటాతో పాటు అదనంగా డిస్నీ ప్లస్ హాట్ స్టార్ 12 నెలలు, అమెజాన్ ప్రైమ్ 6 నెలలు వంటి ఓటీటీ బెనిఫిట్స్ సైతం వస్తాయి. రూ. 699 ప్లాన్ ద్వారా రెండు సిమ్ కార్డులు (1 ప్రైమరీ ప్లస్ మరొకటి అదనపు సిమ్) లభిస్తాయి. ఇద్దరు వ్యక్తులు అన్‌లిమిటెడ్ 4జీ, 5జీ సేవలు పొందవచ్చు. అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్, ఓటీటీ బెనిఫిట్స్ కూడా వస్తాయి. చిన్న కుటుంబాలకు రూ. 999 ప్లాన్ (1 ప్లస్ 2), రూ. 1199, రూ. 1399 (1 ప్రైమరీ ప్లస్ 3 సిమ్ కార్డులు) ప్లాన్లను కూడా తీసుకువచ్చింది. ఈ ప్లాన్లతో ఓటీటీ ప్రయోజనాలతో పాటు యాపిల్ టీవీ, యాపిల్ మ్యూజిక్ సైతం వస్తుంది. నెలకు రూ. 1749తో ఐదుగురు కుటుంబ సభ్యులకు సరిపోయేలా మరో ప్రీమియం ప్లాన్ కూడా ఇస్తోంది. ఇందులో 5 సిమ్ కార్డులు వస్తాయి.

# బజాజ్ ఫైనాన్స్ స్టాక్ దూకుడు.. భారీ లాభాల్లో ట్రేడింగ్




భారతదేశంలో ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ బజాజ్ ఫైనాన్స్ షేరు నేడు స్టాక్ మార్కెట్‌లో సానుకూలంగా ట్రేడ్ అవుతోంది. ఉదయం 11:41 గంటల సమయానికి ఈ షేరు క్రితం ముగింపు ధర 945.10 తో పోలిస్తే దాదాపు 0.97% (రూ. 9.11) పెరిగి రూ. 954.20 వద్ద కొనసాగుతోంది. మార్కెట్ గమనంలో ఈ స్టాక్ పటిష్టమైన స్థితిని ప్రదర్శిస్తోంది. ప్రస్తుతం కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 5,96,238 కోట్లుగా ఉండగా, ఈ రంగంలో మార్కెట్ క్యాప్ పరంగా బజాజ్ ఫైనాన్స్ మొదటి స్థానంలో (ఖీజీనిని 1) కొనసాగుతుండటం విశేషం. కంపెనీ యొక్క ఇతర కీ మెట్రిక్స్ గమనిస్తే, దీని పి.ఇ (ఖఇ) రేషియో 33.09 ద
గాను, షేరుకు వచ్చే ఆదాయం (ఇఖా) 28.98 గాను ఉన్నాయి. ఈ స్టాక్ యొక్క 52 వారాల గరిష్ట ధర రూ. 1,102 కాగా, కనిష్ట ధర రూ. 821 గా నమోదైంది. అదనంగా, కంపెనీ 2.92% డివిడెండ్ యీల్డ్‌ను కలిగి
ఉంది. ఇన్వెస్టర్లు బజాజ్ ఫైనాన్స్ యొక్క ఫండమెంటల్స్, టెక్నికల్ ఇండికేటర్లను పరిశీలిస్తూ మార్కెట్ కదలికలను నిశితంగా గమనిస్తున్నారు. ఈ కారణంతో బజాజ్ ఫైనాన్స్ షేర్లు స్టాక్ మార్కెట్లో సానుకూలంగా ట్రేడ్ అవుతున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఇజ్రాయెల్ రాయబార కార్యాలయాలే లక్ష్యంగా దాడులు

లెబనాన్‌లోని తమ రాయబార కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ ఘాటుగా హెచ్చరించింది. ఒకవేళ ఇజ్రాయెల్ గనుక సాహసించి లెబనాన్‌లోని ఇరాన్ ఎంబసీని తాకితే, ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్న ఇజ్రాయెల్ రాయబార కార్యాలయాలన్నింటినీ తమ లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ సాయుధ దళాల ప్రతినిధి షెకార్చి స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు గరిష్ట స్థాయికి చేరుకున్న తరుణంలో ఇరాన్ చేసిన ఈ ప్రకటన అంతర్జాతీయ సమాజంలో తీవ్ర కలకలం రేపుతోంది. అంతకుముందు ఇజ్రాయెల్ ప్రభుత్వం లెబనాన్‌లోని ఇరాన్ ఎంబసీకి ఒక కీలక హెచ్చరికను జారీ చేసింది. అక్కడ ఉంటున్న ప్రతినిధులు మరియు సిబ్బంది తక్షణమే ఆ కార్యాలయాన్ని ఖాళీ చేసి వెళ్లాలని, ఇందుకు కేవలం 24 గంటల సమయం మాత్రమే ఇస్తున్నామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ డెడ్ లైన్ విధించడంతో, ఇజ్రాయెల్ త్వరలోనే లెబనాన్‌లోని ఇరాన్ దౌత్య కార్యాలయంపై భౌతిక దాడులు చేసే అవకాశం ఉందనే ఊహాగానాలకు బలం చేకూరింది. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలను మరింత దట్టం చేసింది. ప్రస్తుతం లెబనాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న హెజ్బొల్లా మిలిటెంట్లను నిర్మూలించడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ వరుస దాడులు నిర్వహిస్తోంది. హెజ్బొల్లాకు ఇరాన్ వెన్నుదన్నుగా నిలుస్తోందన్నది ఇజ్రాయెల్ ప్రధాన ఆరోపణ. ఈ క్రమంలోనే మిలిటెంట్ల స్థావరాలతో పాటు, వారికి సహకరిస్తున్న ఇరాన్ ప్రతినిధులపై కూడా చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే లెబనాన్ సరిహద్దుల్లో బాంబుల వర్షం కురుస్తుండగా, ఇప్పుడు ఎంబసీలను టార్గెట్ చేయడం యుద్ధాన్ని కొత్త మలుపు తిప్పింది.

ఈ హెచ్చరికల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇజ్రాయెల్ దౌత్య కార్యాలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇరాన్ నేరుగా యుద్ధానికి దిగుతామని ప్రకటించడంతో, ఇది కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగా మిగిలిపోకుండా ప్రాంతీయ యుద్ధంగా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దౌత్య కార్యాలయాలపై దాడులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైనప్పటికీ, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో ఏ క్షణంలోనైనా ఏదైనా జరగవచ్చనే భయాందోళనలు నెలకొన్నాయి.

## ఇరాన్‌పై యుద్ధం ప్రకటిస్తున్న వారి లక్ష్యాల్లో స్పష్టత లేదన్న పెడ్రో సాంచెజ్



ఇరాన్ ఇజ్రాయెల్ ముదురుతున్న యుద్ధ సెగలు ఇప్పుడు అంతర్జాతీయ దౌత్య యుద్ధానికి దారితీస్తున్నాయి. మరో యుద్ధంలోకి తమ దేశాన్ని లాగవద్దని, శాంతిని కోరుకుం టున్నందుకు తమపై ఆంక్షలు విధించడం సరికాదని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పెయిన్‌తో వాణిజ్య సంబంధాలను తెంచుకుం టామని హెచ్చరించిన నేపథ్యంలో, సాంచెజ్ ఈరోజు జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఇరాన్‌పై యుద్ధం ప్రకటిస్తున్న వారి లక్ష్యాల్లో స్పష్టత లేదని, స్పెయిన్ ఎన్నడూ ఇలాంటి రక్తపాతాన్ని కోరుకోలేదని ఆయన పేర్కొన్నారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాలు యుద్ధాన్ని ఆపాలని పలు దేశాలు చేసిన తీర్మానాల తర్వాతే తాము ఈ డిమాండ్ చేస్తున్నామని గుర్తుచేశారు. ఒక దేశం చేసే చట్టవిరుద్ధమైన చర్యలకు మరో దేశం అదే స్థాయిలో స్పందించడం వల్ల మానవాళికి భారీ విపత్తులు తప్పవని ఆయన హెచ్చరించారు.

# కాళ్లు, చేతులు తిమ్మిర్లు పడుతున్నాయా?

చాలా మందికి తరచుగా చేతులు, కాళ్ళు తిమ్మిరిగా అనిపిస్తాయి. దీనిని సాధారణమైనదిగా భావించి విస్మరిస్తారు.. కానీ, అలా చేయడం తెలివైన పని కాదంటున్నారు వైద్య నిపుణులు.. ఎందుకంటే ఇది వివిధ కారణాల వల్ల సంభవించవచ్చు. ఎక్కువసేపు ఒకే స్థితిలో కూర్చోవడం, ఒక కాలు మీద నిలబడటం, చేతులను ఒకే స్థితిలో ఉంచినప్పుడు.. లేదా తప్పుడు స్థితిలో నిద్రపోవడం వల్ల తిమ్మిర్లు వస్తాయి.. చాలా మందికి తరచుగా చేతులు, కాళ్ళు తిమ్మిరిగా అనిపిస్తాయి. దీనిని సాధారణమైనదిగా భావించి విస్మరిస్తారు.. కానీ, అలా చేయడం తెలివైన పని కాదంటున్నారు వైద్య నిపుణులు.. ఎందుకంటే ఇది వివిధ కారణాల వల్ల సంభవించవచ్చు. ఎక్కువసేపు ఒకే స్థితిలో కూర్చోవడం, ఒక కాలు మీద నిలబడటం, చేతులను ఒకే స్థితిలో ఉంచినప్పుడు.. లేదా తప్పుడు స్థితిలో నిద్రపోవడం వల్ల తిమ్మిర్లు వస్తాయి.. ముఖ్యంగా నరాలపై ఒత్తిడి పెరగడం వల్ల తిమ్మిర్లు వస్తాయి. ఒకే పొజిషన్‌లో ఎక్కువసేపు ఉండటం వల్ల.. అది నాడులపై, రక్త ప్రసరణపై ఒత్తిడిని పెంచి చేతులు, కాళ్లు మొద్దు బారడం అంటే.. తిమ్మిరి పడతాయి.. అయితే.. మొబైల్ ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌ను ఎక్కువసేపు ఉపయోగించడం వల్ల కూడా నరాలపై ఒత్తిడి పెరుగుతుంది. విటమిన్ బి12 లోపం, మధుమేహం, థైరాయిడ్ సమస్యలు, రక్త ప్రసరణ సమస్యలు కూడా తిమ్మిరికి కారణమవుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అదనంగా, మెడ లేదా వీపులోని నరాల సంపీడనం చేతులు ? కాళ్ళలో జలదరింపు, తిమ్మిరికి కారణమవుతుంది. కొన్నిసార్లు, ఒత్తిడి ? ఆందోళన కూడా నరాలను ప్రభావితం చేస్తాయి. ఈ సమస్య పదేపదే సంభవిస్తే లేదా ఎక్కువ కాలం కొనసాగితే, దానిని తేలికగా తీసుకోకూడదు. అందువల్ల, చేతులు ? కాళ్ళలో తిమ్మిరి ఎప్పుడు సాధారణమో.. అది నరాల సమస్యకు సంకేతంగా ఎప్పుడు ఉంటుందో అర్థం చేసుకోవడం ముఖ్యం. కొద్దిసేపు ఒత్తిడి కారణంగా చేతులు లేదా కాళ్ళు తిమ్మిరి చెంది, ఆ తర్వాత భంగిమ



మార్చడంతో తగ్గిపోతే, అది సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. కూర్చోవడం, నిద్రపోవడం లేదా ఎక్కువసేపు తప్పు స్థితిలో ఉండటం వల్ల నరాల మీద తాత్కాలిక ఒత్తిడి ఏర్పడుతుంది.. ఇది జలదరింపుకు కారణమవుతుంది. అయితే, తిమ్మిరి ఎటువంటి స్పష్టమైన కారణం లేకుండా పదేపదే సంభవిస్తే, ఎక్కువసేపు కొనసాగితే, లేదా నొప్పి, మంట లేదా బలహీనతతో పాటు ఉంటే, అది నరాల సమస్యకు సంకేతం కావచ్చు.మీరు నడుస్తున్నప్పుడు అస్థిరతను అనుభవిస్తే లేదా నిటారుగా నిలబడటానికి ఇబ్బందిగా అనిపిస్తే, దానిని విస్మరించకూడదు. మధుమేహం వల్ల నరాల దెబ్బతినడం వల్ల చేతులు ? కాళ్ళలో తిమ్మిరి వస్తుంది. వెన్నెముక నరాల కుదింపు కూడా ఈ పరిస్థితికి కారణమవుతుంది. మీరు శరీరంలోని ఒక భాగంలో అకస్మాత్తుగా తిమ్మిరిని అనుభవిస్తే, మాట్లాడటం లేదా నడవడంలో ఇబ్బందిగా ఉంటే, వెంటనే వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. నిరంతర ? తీవ్రమవుతున్న తిమ్మిరికి తీవ్రమైన కారణాలు ఉండవచ్చు. మధుమేహం వల్ల నరాల దెబ్బతినడం, తీవ్రమైన విటమిన్ బి12 లోపం, వెన్నెముక నరాల సంపీడనం ప్రమాదకరం కావచ్చు. ఆకస్మిక తిమ్మిరి, బలహీనత లేదా ముఖం ఒక వైపు వాలిపోవడం స్ట్రోక్‌ను సూచిస్తుంది. ఈ లక్షణాలు కనిపిస్తే తక్షణ మూల్యాంకనం, చికిత్స అవసరం. నిర్లక్ష్యం వల్ల పరిస్థితి మరింత దిగజారిపోతుంది.

## కివీ పండు తొక్క తీసి పారేస్తున్నారా?



చాలామంది కివీ పండు అనగానే లోపల ఉండే పచ్చని గుజ్జును మాత్రమే ఇష్టంగా తింటారు. పైన ఉండే గోధుమ రంగు తొక్కను చూసి అసహ్యంచుకుని పారేస్తుంటారు. కానీ, నిపుణులు చెబుతున్న దాని ప్రకారం.. కివీ తొక్కను పారేయడం అంటే సగానికి పైగా పోషకాలను వదులుకోవడమే! కివీ గుజ్జు కంటే దాని తొక్కలో 50 శాతం ఎక్కువ పీచు పదార్థం శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. విటమిన్ సి అధికంగా ఉండే పండల్లో కివి ముందు వరుసలో ఉంటుంది. అంతటి పోషకాలున్న ఈ పండు గుజ్జులోనే కాదు పై పొరలో కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయట. కివీ తొక్క తినడం వల్ల కలిగే అద్భుత ప్రయోజనాలు ఏంటి? కివీ తొక్కలో ఉండే అధిక పీచు పదార్థం పేగుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది మలబద్ధకాన్ని వదిలించడమే కాకుండా, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక బెస్ట్ ఆప్షన్.కివీ తొక్కలో విటమిన్ సి ఇ సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి సహజమైన రక్షణ కవచంలా పనిచేస్తాయి. ఇందులోని యాంటీ మైక్రోబియల్ గుణాలు హానికర బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని కాపాడతాయి.వృద్ధాప్య ఛాయలను తగ్గించడంలో కివీ తొక్క అద్భుతంగా పనిచేస్తుంది. విటమిన్ ఇ చర్మం పొడిబారకుండా చూస్తుంది. కొంతమంది సహజ సౌందర్యం కోసం దీనిని ఫేస్ స్క్రబ్‌లలో కూడా ఉపయోగిస్తారు. ఇందులోని ఫ్లేవనాయిడ్స్ శరీరంలో వాపును తగ్గిస్తాయి. గుండె జబ్బులు, మధుమేహం క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును తగ్గించడంలో కివీ తొక్క సహాయపడుతుంది. పండును పూర్తిగా తొక్కతో సహా తినడం వల్ల ఆహార వృధాను తగ్గించవచ్చు. ఇది పర్యావరణానికి మనం చేసే చిన్న సహాయం.

# తిన్న వెంటనే నడక.. ఆరోగ్యానికి మంచిదా..?



భోజనం చేసిన తర్వాత కాసేపు అలా నడవడం మనలో చాలా మందికి అలవాటు. దీని వల్ల తిన్న ఆహారం త్వరగా జీర్ణం అవుతుందని చాలా మంది నమ్ముతారు. కానీ ఇందులో ఎంతవరకు నిజం ఉంది. దీని గురించి నిపుణులు ఏం చెబుతున్నారు. భోజనం చేసిన వెంటనే నడవడం ఖచ్చితంగా ప్రయోజనకంగా ఉంటుంది ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కానీ అది మనం నడిచే విధానంపై ఆదారపడి ఉంటుందని అంటున్నారు. తీవ్రమైన వ్యాయామం లేదా వేగవంతమైన నడక కంటే నెమ్మదిగా నడవడం వల్ల ఎక్కువ ప్రయోజనా ఉన్నాయని చెబుతున్నారు. ఎందుకంటే భోజనం చేసిన వెంటనే 60 నుండి 90 నిమిషాలలోపు చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కాబట్టి, భోజనం చేసిన వెంటనే లేదా 15 నిమిషాలలోపు నడవడం వల్ల కండరాలు ఈ గ్లూకోజ్‌ను ఉపయోగించుకుంటాయి, తద్వారా రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. నిపుణుల సలహా ప్రకారం.. భోజనం తర్వాత కనీసం 10 నుండి 15 నిమిషాలు విశ్రాంతి తీసుకోవడం ఉత్తమం. తర్వాత మీరు నెమ్మదిగా నడకను ప్రారంభించచ్చు. ఫుల్‌గా తిన్న తర్వాత వెంటనే వేగంగా నడవడం కన్నా.. నెమ్మదిగా నడవడం మంచింది.దీని వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. షుగర్ కంట్రోల్: భోజనం చేసిన 60 నుండి 90 నిమిషాలలోపు నడవడం వల్ల కండరాలు రక్తంలోని గ్లూకోజ్‌ను ఉపయోగించుకుంటాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలలో పెరుగుదలను నియంత్రిస్తుంది, ఇది ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు, ప్రీడయాబెటిస్ ఉన్నవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.బరువు నిర్వహణ: భోజనం తర్వాత నడవడం వల్ల జీవక్రియ పెరుగుతుంది, కేలరీలు బర్న్ అవుతాయి. ఇది దీర్ఘకాలంలో బరువు తగ్గడానికి సహాయపడుతుంది.గుండె ఆరోగ్యం: భోజనం తర్వాత క్రమం తప్పకుండా నడవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఇది గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. మానసిక శ్రేయస్సు నిద్ర: నడక వల్ల శరీరంలో ఎండార్ఫిన్లు వంటి 'మంచి అనుభూతిని కలిగించే' హార్మోన్లు విడుదలవుతాయి, ఇవి ఒత్తిడిని తగ్గించి, రాత్రిపూట మంచి నిద్ర పొందడానికి సహాయపడతాయి.

# వాటర్ హీటర్.. ఎక్కువగా వాడుతున్నారా?



గీజర్లకు బదులుగా సాధారణ వాటర్ హీటర్లతో నీటిని అతిగా వేడి చేసి స్నానం చేయడం చర్మ, ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అధిక వేడి చర్మంపై తేమ పొరను దెబ్బతీసి పొడిబారడం, దురద కలిగిస్తుంది. నాణ్యత లేని పరికరాలతో లోహ కణాలు నీటిలో చేరి అలర్జీలు రావచ్చు. ఇళ్లలో గీజర్‌కు బదులుగా సాధారణ వాటర్ హీటర్‌తో నీటిని వేడి చేసి స్నానం చేసే అలవాటు కొందరిలో పెరుగుతోంది. అయితే నీటిని అతిగా వేడి చేయడం లేదా పరికరాలను సరిగా ఉపయోగించకపోవడం వల్ల ఆరోగ్య, చర్మ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీరు చాలా ఎక్కువ ఉష్ణోగ్రతకు చేరితే చర్మంపై ఉన్న సహజ తేమ పొర దెబ్బతింటుంది. దీని వల్ల చర్మం పొడిబారడం, దురద, ఎర్రబారడం వంటి సమస్యలు కనిపించవచ్చు. ముఖ్యంగా సున్నితమైన చర్మం ఉన్నవారు, పిల్లలు, వృద్ధులు అధిక వేడి నీటితో స్నానం చేస్తే చర్మ రక్షణ పొర త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉంది. కొన్నిసార్లు స్వల్ప కాలిన గాయాలు కూడా ఏర్పడవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇంకా

ఒక ముఖ్యమైన అంశం నీటి నాణ్యత. కొంతమంది ఉపయోగించే ఇమర్షన్ రాడ్లు లేదా తక్కువ నాణ్యత గల వాటర్ హీటర్లు నీటిలో లోహ కణాలు లేదా మలినాలు కలిసే ప్రమాదాన్ని పెంచుతాయి. అటువంటి నీటితో తరచుగా స్నానం చేస్తే చర్మ అలర్జీలు, రాష్‌లు వచ్చే అవకాశాన్ని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే సరైన ఇన్సులేషన్ లేకుండా ఉన్న పరికరాలు విద్యుత్ షాక్ ప్రమాదాన్ని కూడా పెంచుతాయి. అయితే సరైన ఉష్ణోగ్రతలో, నాణ్యమైన పరికరంతో నీటిని వేడి చేసి ఉపయోగిస్తే పెద్ద ఆరోగ్య ప్రమాదాలు ఉండవని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. నీరు మితమైన వేడిగా సుమారు 37 నుంచి 40 డిగ్రీల మధ్య ఉండేలా చూసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. స్నానం తర్వాత మాయిశ్చరైజర్ వాడటం ద్వారా చర్మ పొడిబారడం తగ్గించుకోవచ్చు. మొత్తంగా గీజర్ కాని వాటర్ హీటర్ కాని పరికరం ఏదైనా సరే, నీటి ఉష్ణోగ్రత నియంత్రణ, పరికరం నాణ్యత, భద్రతా జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య సమస్యలను చాలా వరకు నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# కడుపులో గ్యాస్ సమస్యకు విరుగుడు!

ఉదయం వేళల్లో చాలా మందికి గ్యాస్ సమస్య ఉంటుంది. సాధారణం చాలా మంది ఈ సమస్యతో బాధపడుతున్నప్పటికీ పెద్దగా పట్టించుకోరు. కడుపులో గ్యాస్ నిరంతరం భారంగా అనిపించేలా చేస్తుంది. కొందరికి ఈ సమస్య రోజంతా ఉంటుంది. దీంతో ఈ సమస్య నయం చేయడానికి చాలా మంది మందులు తీసుకుంటారు. కానీ కొన్ని ఇంటి నివారణలను అనుసరించడం ద్వారా కూడా వెంటనే ఉపశమనం పొందవచ్చు. గోరువెచ్చని నీళు – నిమ్మరసం: ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు 'మేల్కొలుపు' లాంటిది. ఇందులో సగం నిమ్మకాయ పిండి ఈ నీటిని తాగడం వల్ల శరీరం నుంచి విషాన్ని బయటకు పంపించవచ్చు. ఇది ఆమ్లతను తగ్గిస్తుంది. అల్లం టీ.. అల్లంలో జింజెరాల్
ఉంటుంది. ఇది జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. ఒక చిన్న అల్లం ముక్కను నోట్లో వేసుకుని నమలవచ్చు లేదా నీటిలో మరిగించిన అల్లం టీ తాగవచ్చు. ఇది కడుపు కండరాలను సడలిస్తుంది. వాము – నల్ల ఉప్పు.. ఇది గ్యాస్ కు అత్యంత పురాతనమైన, అత్యంత ప్రభావవంతమైన నివారణ. వాములో ఉండే 'థైమోల్' జీర్ణ రసాలను సక్రియం చేస్తుంది. ఇందు కోసం అర టీస్పూన్ వాము, చిటికెడు ఉప్పును గోరువెచ్చని నీటితో కలిపి తాగాలి.జీలకర్ర నీళ్లు.. జీలకర్ర లాలాజల గ్రంథులను ఉత్తేజపరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందు కోసం ఒక చెంచా జీలకర్రను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం



మరిగించి, వడకట్టి టీ లాగా వేడిగా తాగాలి. ఇంగువ నీళ్లు.. గ్యాస్ కారణంగా కడుపు నొప్పితో బాధపడుతుంటే ఇలాంటి వారికి ఇంగువ దివ్యౌషధం. గోరువెచ్చని నీటిలో చిటికెడు ఇంగువ కలిపి తాగాలి లేదా ఇంగువ పేస్ట్ లా చేసి నాభి చుట్టూ అప్లై చేయాలి. ఇది చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది.

## వెల్లుల్లి టీతో ఎన్ని లాభాలో..



మనలో చాలా మందికి ఉదయం వేడివేడి పాలు లేదా టీ తాగనిదే రోజు గడవదు. అయితే, ఈ అలవాటుకు బదులుగా 'వెల్లుల్లి టీ'ని మీ దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే మీ ఆరోగ్యం ఊహించని విధంగా మెరుగుపడుతుంది. వెల్లుల్లి కేవలం వంటలకు రుచిని ఇవ్వడమే కాదు, ఇందులో ఉండే 'అల్లిసిన్' అనే రసాయనం ఒక శక్తివంతమైన సహజ యాంటీబయాటిక్‌గా పనిచేస్తుంది. గుండె ఆరోగ్యం నుంచి బరువు తగ్గడం వరకు, రోగనిరోధక శక్తిని పెంచడం నుంచి కొలెస్ట్రాల్ తగ్గించడం వరకు వెల్లుల్లి టీ చేసే మేలు అంతా ఇంతా కాదు. వందల రూపాయల మాత్రల కంటే, వంటగదిలో అతి తక్కువ ధరకు దొరికే వెల్లుల్లి మన శరీరానికి ఎక్కువ రక్షణ కల్పిస్తుంది. మరి ఈ అద్భుతమైన టీని ఎలా తయారు చేయాలి? గుండెకు రక్ష: వెల్లుల్లి టీ రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్త నాళాల్లోని అడ్డంకులను తొలగిస్తుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తూ గుండెపోటు ముప్పును తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తి: వెల్లుల్లిలోని అల్లిసిన్ బ్యాక్టీరియా వైరస్‌లను నాశనం చేస్తుంది. జలుబు, దగ్గు, శ్లేష్మం వంటి సమస్యలతో బాధపడేవారికి ఇది గొప్ప ఉపశమనం. బరువు తగ్గడం: ఇది శరీర జీవక్రియను వేగవంతం చేసి, అవాంఛిత కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచి గ్యాస్ సమస్యలను దూరం చేస్తుంది. 2 లేదా 3 వెల్లుల్లి రెబ్బలను తీసుకుని పొట్టు తీసి బాగా నలపాలి. నలిపిన వెల్లుల్లిని 10 నిమిషాల పాటు గాలిలో ఉంచాలి (అప్పుడే అల్లిసిన్ విడుదలవుతుంది).ఒక గ్లాసు నీటిని మరిగించి, స్టవ్ ఆపివేసి, అందులో ఈ వెల్లుల్లి వేసి 5 నిమిషాలు మూత పెట్టి ఉంచాలి. ఆ తర్వాత వడకట్టి, కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తాగాలి. రోజుకు ఒక కప్పు వెల్లుల్లి టీ సరిపోతుంది. అతిగా తాగితే గుండెల్లో మంట లేదా కడుపులో అల్సర్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా తీవ్రమైన అల్సర్ ఉన్నవారు, శస్త్రచికిత్స జరగబోయే వారు, మరియు రక్తాన్ని పలుచబరిచే మందులు వాడేవారు వైద్యుడిని సంప్రదించిన తర్వాతే దీనిని తీసుకోవాలి.

# కల్తీ పాలను ఇంట్లోనే ఇలానే గుర్తించండి.!



మీ ఆరోగ్యం కోసం కల్తీ పాలను ఇంట్లోనే సులభంగా గుర్తించండి. పాలలో నీరు, పిండి, సర్ఫ్ లేదా గంజి పౌడర్ లాంటివి కలిపారో లేదో నేచురల్ చిట్కాలతో తెలుసుకోవచ్చు. ఈ చిట్కాలతో మీ కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోండి. మనం నిత్యం ఉపయోగించే వాటిల్లో పాలు ఒకటి. కానీ, ఇటీవల కాలంలో పాలలో కల్తీ పెరిగిపోవడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ పరిస్థితిలో, మనం కొనే పాలు స్వచ్ఛమైనవో కావో ఇంట్లోనే గుర్తించడం చాలా అవసరం. నీటి కల్తీ: ఒక పలకను ఏటవాలుగా ఉంచి, దానిపై పాలచుక్కను జారవిడిస్తే.. పాలు నెమ్మదిగా, తెల్లని గీతతో కిందకు జారితే స్వచ్ఛమైనవి. అలా కాకుండా, అస్పష్టంగా, చాలా వేగంగా జారితే పాలలో నీరు కలిసినట్లు అర్థం చేసుకోవాలి.పిండి లేదా స్టార్చ్ కల్తీ: కొద్దిపాటి పాలలో అయోడిన్ ద్రావణం ఒకటి లేదా రెండు చుక్కలు వేయండి. పాలు నీలి రంగులోకి మారితే, అందులో పిండి లేదా స్టార్చ్ కలిపారని అర్థం. పాలు తమ సాధారణ తెలుపు రంగులోనే ఉంటే, కల్తీ లేనట్లు.సర్ఫ్, సబ్బు లేదా నూనెల కల్తీ: పాలను మరిగించినప్పుడు పసుపు రంగులోకి మారితే, అందులో సర్ఫ్, సబ్బు లేదా ఇతర నూనె పదార్థాలు కలిసినట్లు సూచిస్తుంది. స్వచ్ఛమైన పాలు మరిగించినప్పుడు రంగు మారవు. గంజి పౌడర్ కల్తీ: 5 మిల్లీలీటర్ల పాలలో 2 స్పూన్ల ఉప్పు కలపండి. ఈ మిశ్రమం నీలి రంగులోకి మారితే, పాలలో గంజి పౌడర్ కలిపినట్లు తెలుస్తుంది. ఈ చిట్కాలు మీ కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎంతగానో సహాయపడతాయి. అయితే, ఇది కేవలం అవగాహన కోసమే అని గుర్తుంచుకోవాలి. ఆరోగ్య సమస్యలుంటే వైద్య నిపుణులను సంప్రదించడం ఉత్తమం.

## ఇంగ్లాండ్‌పై భారత్ గెలవడం కష్టం.. పాక్ మాజీ క్రికెటర్ బోల్డ్ ప్రెడిక్షన్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా జరిగే సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి. ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరగనున్న ఈ కీలక మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కాగా, ఇప్పటికే సూపర్---8 దశలోనే టోర్నమెంట్ నుంచి నిష్క్రమించిన పాకిస్థాన్ జట్టు.. ఆ దేశ మాజీ క్రికెటర్లు మాత్రం ఈ మ్యాచ్‌పై పిచ్చి కూతలు కూస్తున్నారు. మాజీ పాకిస్థాన్ కెప్టెన్ రషీద్ లతీఫ్ 'హార్నా మనా హై' అనే కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఇంగ్లాండ్ జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నాడు. ఎందుకంటే, కఠినమైన పరిస్థితుల్లోనూ వారు బాగా ఆడుతున్నారు.. ఆ జట్టులో ఇద్దరు లేదా ముగ్గురు బ్యాటర్లు ఫామ్‌లో ఉన్నారు.. ముఖ్యంగా మిడిల్ ఆర్డర్ చాలా బలంగా ఉందని కామెంట్స్ చేశాడు.

వాంఖడే మైదానంలో పరిస్థితులు కూడా ఇంగ్లాండ్‌కు అనుకూలంగా ఉండొచ్చని రషీద్ లతీఫ్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్ ఆటగాళ్లలో ఒక్కరు మంచి ప్రదర్శన చేసినా భారత్ ఓడిపోవడం పక్కా అని వ్యాఖ్యానించాడు. ఈ టోర్నీ ప్రారంభంలో ఇంగ్లాండ్ జట్టు ఆశించిన విధంగా ప్రదర్శన చేయలేక పోయింది.. అయినప్పటికీ క్రమంగా పుంజుకుని సెమీఫైనల్‌కు చేరుకుంది అన్నాడు. గ్రూప్ దశలో నేపాల్, ఇటలీపై కష్టపడి గెలవగా, వెస్టిండీస్ చేతిలో ఘోరంగా ఓడిపోయింది. సూపర్-8 దశలో మాత్రం శ్రీలంక, పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్లపై అద్భుతంగా ఆడిన ఇంగ్లాండ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.

ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా ఈ మ్యాచ్‌పై నమ్మకం వ్యక్తం చేశాడు. క్లోజ్ మ్యాచ్‌లలో కూడా గెలవడం మాకు అలవాటు.. ఆటలో ఎప్పుడూ నిరాశ చెందొద్దు అని నేను నేర్చుకున్నాను.. మా ప్లేయర్స్ లో గెలవాలనే తపన ఉంది.. ఒత్తిడిలో కూడా ప్రశాంతంగా ఆడగల సామర్థ్యం మాకు ఉందని వెల్లడించాడు.

భారత్‌తో మ్యాచ్ ఆడాలని మా జట్టులో చాలా మంది ముందే కోరుకున్నారు.. ఇది చాలా పెద్ద మ్యాచ్.. ఇరు జట్లపై కూడా ఒత్తిడి ఉంటుంది.. ఇండియన్స్ కి వారి అభిమానుల నుంచి మద్దతు ఉంటుంది.. వాంఖడే స్టేడియం మొత్తం సూర్య సేనకు సపోర్టు చేస్తుంది.. అయినప్పటికీ మేము మా ఆటను ప్రదర్శించాలని ఆశిస్తున్నాం.. జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్ ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారని బ్రూక్ పేర్కొన్నాడు.

## నేను ఇంటికి పోతా.. మమ్మల్ని పంపించండి: కోల్‌కతాలో చిక్కుకున్న డారెన్ సామీ ఆవేదన

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం వల్ల మిడిల్ ఈస్ట్?లో విమాన రాకపోకలు స్తంభించిపోయాయి. టీ20 వరల్డ్ కప్ ఆడేందుకు ఇండియాకు వచ్చిన వెస్టిండీస్ క్రికెట్ జట్టు మిడిల్ ఈస్ట్?లో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఐదు రోజులుగా కోల్?కతాలోనే చిక్కుకుపోయింది. ఈ క్రమంలో వెస్టిండీస్ హెడ్ కోచ్ డారెన్ సామీ తీవ్ర విచారం వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేసిన సామీ.. తనకు ఇంటికి వెళ్లాలనుందని పేర్కొన్నాడు. అసలు ఏం జరుగుతుందో మాకు ఏదైనా అప్డేట్ ఇవ్వండి.. ఇవాళా, రేపా లేక ఇంకో వారమా ఎప్పుడూ వెళ్తామో చెప్పండని కోరాడు. ఇప్పటికే ఐదు రోజులు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, టీ20 వరల్డ్ కప్ నుంచి వెస్టిండీస్ నిష్క్రమించిన విషయం తెలిసిందే. ఈడెన్ గార్డెన్స్ వేదికగా సూపర్ 8 రౌండ్?లో భాగంగా ఇండియాతో జరిగిన డూ ఆర్ డై మ్యాచ్‌లో వెస్టిండీస్ ఓటమి పాలై ఇంటి దారి పట్టింది. కరేబియన్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ ఐదు రోజులుగా ఇక్కడే చిక్కుకుపోయారు.

మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ పరిస్థితుల వల్ల విమాన రాకపోకలపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. దీంతో వెస్టిండీస్ ప్లేయర్ తమ సొంత దేశం వెళ్లేందుకు వీలు లేకుండాపోయింది. ఇదిలా



ఉండగా.. వెస్టిండీస్ క్రికెటర్స్ ను సొంత దేశానికి తరలించేందుకు ఐసీసీ చర్యలు చేపట్టినట్లు జుగ్రాచీఎతీఱఎఱఅటశీ నివేదించింది. కోల్‌కతా నుంచి లండన్ మీదుగా కరేబియన్ దీవులకు వెళ్లేలా చార్టర్డ్ ఫ్లైట్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో వెస్టిండీస్ క్రికెటర్స్ తమ స్వస్థలాలకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

## అభిషేక్ శర్మ చెలరేగితే ఇండియాను ఆపే టోడే లేడు.. కానీ!

**హైదరాబాద్ పెన్ పవర్:** 20 ప్రపంచ కప్ 2026 రెండో సెమీఫైనల్ మ్యాచ్ ఈరోజు ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఇప్పటికే ఫైనల్ కి వెళ్లిన న్యూజిలాండ్ జట్టుతో తలపడనుంది. మొదటి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై తొమ్మిది వికెట్ల తేడాతో న్యూజిలాండ్ విజయం సాధించింది. కాగా, రెండో సెమీఫైనల్‌లో భారత్ బలమైన ప్రదర్శన చేసి ఫైనల్ ఫైట్ కి అర్హత సాధించాలని చూస్తుంది. ఇందులో భాగంగా టీమిండియా ఓపెనర్లు తమ ప్రదర్శనను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. అయితే వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ మాత్రం వెస్టిండీస్ తో జరిగిన మ్యాచ్ తో ఫామ్‌లోకి వచ్చాడు.



**ముంబై ఇండియన్స్ బ్రిగేడ్‌పై ఆశలు:**

భారత జట్టులో ఉన్న ముంబై ఇండియన్స్ ప్లేయర్స్ ఈ మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఇషాన్ కిషన్ టోర్నమెంట్ ప్రారంభంలో అద్భుతంగా ఆడినా ఇటీవల ఫామ్ కోల్పోయినట్లు కనిపిస్తుంది. గతంలో ముంబై ఇండియన్స్ జట్టు తరపున ఐపీఎల్ లో అనేక మ్యాచ్ లు ఆడిన అనుభవం ఉండటంతో.. వాంఖడేలో తిరిగి మంచి ఇన్నింగ్స్ ఆడాలని చూస్తున్నాడు. అలాగే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా వాంఖడేలో రాణించాలని అభిమానుల గంపెడు ఆశలు పెట్టుకున్నారు.

**అభిషేక్ శర్మ ఫామ్:**

టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ ప్రారంభానికి ముందు అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ ఈ పొట్టి వరల్డ్ కప్‌లో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. సూపర్-8 దశలో జింబాబ్వేపై హాఫ్ సెంచరీ చేసినా తన అసలు దూకుడు ఇప్పటి వరకు ఇంకా కనిపించలేదు. ఈ సెమీఫైనల్‌లో పెద్ద ఇన్నింగ్స్ ఆడాల్సిన అవసరం ఉంది. ఒకవేళా ఈ సెమీస్ లో అతడు గానీ చెలరేగితే ఏ ఇంగ్లాండ్ బౌలర్ కూడా అభిషేక్ ని ఔట్ చేసే సహాసం చేయరు అని క్రీడా పండితులు పేర్కొంటున్నారు.

**శాంసన్ అద్భుత ఫామ్:**

ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌కు ముందు స్టార్ ఓపెనర్ సంజు శాంసన్ పూర్తి స్థాయిలో ఆత్మ విశ్వాసంతో బరిలోకి దిగుతున్నాడు. వెస్టిండీస్‌పై జరిగిన కీలక మ్యాచ్‌లో అతను అజేయంగా 97 పరుగులతో నాటౌట్ గా నిలిచి, భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దాదాపు 10 సంవత్సరాల తర్వాత అంతర్జాతీయ వేదికపై సంజు కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన అని చెప్పాలి.

**ఇంగ్లాండ్ బౌలర్ల సవాల్:**

ఇంగ్లాండ్ బౌలర్లు టీమిండియా ఓపెనర్లకు కఠిన పరీక్ష పెట్టే అవకాశం కనిపిస్తుంది. సీనియర్ స్పీడ్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ తన బౌన్సర్లతో సంజు శాంసన్‌ను ఇబ్బంది పెట్టే ఛాన్స్ ఉందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు ఆఫ్ స్పిన్‌తో విల్ జాక్స్ పవర్‌ప్లేలో మరింత ప్రభావం చూపించే అవకాశం ఉంది. అలాగే, మిడిల్ ఓవర్లలో ఇంగ్లాండ్ స్పిన్ దళం ఇండియన్ జట్టుకు పెద్ద సవాల్ గా మారనుంది. లెగ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ ఇప్పటి వరకు ఈ మెగా టోర్నమెంట్‌లో మొత్తం 11 వికెట్లు పడగొట్టగా, లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్ లియామ్ డాసన్ 10 వికెట్లు తీసి అద్భుతమైన ఫామ్‌ని కనబరుస్తున్నాడు.

**వరుణ్ చక్రవర్తికి అగ్ని పరీక్ష:**

టీమిండియా మిస్టరీ స్పిన్ బౌలర్ వరుణ్ చక్రవర్తి ఈ టోర్నమెంట్‌లో ఇప్పటి వరకు స్థిరంగా రాణించలేకపోయాడు. సెమీఫైనల్‌లోనైనా అతను మెరుగైన ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది. మరోవైపు, జస్ ప్రీత్ బుమ్రా మాత్రమే భారత జట్టు తరపున ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నప్పటకీ, హార్ధిక్ పాండ్యా, అర్ష్ దీప్ సింగ్ వికెట్లు తీసుకుంటున్నప్పటికీ.. ధారళంగా పరుగులు సమర్పించుకుంటున్నారు.

## సెట్ లో అయినా, ఇంట్లో అయినా.. గౌరవం ఇవ్వాల్సిందే!

టాలీవుడ్‌లో మహిళా డైరెక్టర్ల సంఖ్య ఇంకా తక్కువగా ఉన్నప్పటికీ, నటి వరలక్ష్మి శరత్‌కుమార్ తనదైన ముద్ర వేయాలని డైరెక్టర్ గా కొత్త అడుగు వేస్తున్నారు. ఆమె దర్శకత్వంలో రూపొందిన సరస్వతి సినిమా మార్చి 6న రిలీజ్ కావడానికి సిద్ధమవుతుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ రాగా, ఈ చిత్ర ప్రమోషన్స్ లో వరూ యాక్టివ్ గా పాల్గొంటున్నారు.

**ఆ సినిమా నుంచి తప్పుకున్నా!**

అహం, ఆత్మగౌరవంలో తాను ఆత్మ గౌరవానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తానని, ఓ మలయాళ మూవీలో తనను తక్కువగా చూశారని ఆ సినిమా నుంచి తాను తప్పుకున్నట్టు ఆమె వెల్లడించారు. ఆ సినిమా హీరో, డైరెక్టర్ మంచి వాళ్లైనప్పటికీ, నిర్మాత తనతో వ్యవహరించిన తీరు



నచ్చకపోవడంతో, హీరోకు కాల్ చేసి ఈ సినిమాను చేయడం లేదని చెప్పానని, అది అహంభావం కాదని, ఆత్మ గౌరవమని ఆమె తెలిపారు.

**అందరితో నిజాయితీగా ఉంటా!**

తాను అందరితో నిజాయితీగా ఉంటానని, తాను అందరినీ గౌరవిస్తానని, తనను కూడా అందరూ గౌరవించాలని కోరుకుంటానని, సెట్ లో అయినా, ఇంట్లో అయినా ఎక్కడైనా గౌరవం ఇవ్వాల్సిందేనని, లేదంటే అస్సలు సహించనని ఆమె పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తల్ని తాను పెద్దగా పట్టించుకోనని చెప్తున్న ఆమె, సోషల్ మీడియాలో వచ్చిన ఓ వార్తను చూసి తాను తెగ నవ్వుకున్నానని తెలిపారు.

**అదే ఉంటే ఇక్కడెందుకు ఉంటా?**

తన పెళ్లికి రూ.800 కోట్లు ఖర్చైందని సోషల్ మీడియాలో వార్తలొచ్చాయని, అంత డబ్బే తన దగ్గరుంటే అసలు ఇక్కడ ఎందుకు ఉంటానని అడిగారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా గురించి కూడా ఆమె మాట్లాడారు. సోషల్ మీడియా కాలక్షేపానికి పనికొస్తుందని, దానిపై ఎక్కువ టైమ్ వేస్ట్ చేయకుండా, క్రియేటివ్ గా ఆలోచిస్తే, అది కెరీర్ కు ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. ఫహద్ ఫాసిల్, ఆలియా భట్, మంజు వారియర్, దీపికా పదుకొణె ను తానెంతో అభిమానిస్తానని చెప్తున్న వరలక్ష్మి, నాంది మూవీలో ఆద్య క్యారెక్టర్ అంటే చాలా ఇష్టమని, అది యాక్టింగ్ పరంగా చాలా గొప్ప పాత్ర అని చెప్పుకొచ్చారు. సరస్వతి సినిమా అన్ని వర్గాల ఆడియన్స్ ను ఆకట్టుకుంటుందని, ఈ సినిమా తీసినందుకు తనకు గర్వంగా ఉందని ఆమె పేర్కొన్నారు.



అనన్య నాగల్లా సొగసైన ఎంబ్రాయిడరీ చీరలో టైమ్‌లెస్ గ్రేస్‌ను ప్రసరిస్తుంది



కలర్‌ఫుల్ పోస్ట్‌ను షేర్ చేసింది అనసూయ

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965